తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం-10 - జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 253 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# మున్సిపల్ ఎన్నికల్లో మోదీ పేరు ఎందుకు?

## తెలంగాణకు ఏం ఇచ్చారు?: సీఎం రేవంత్‌రెడ్డి

- మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొంది
- కేంద్ర పాలనలో తెలంగాణకు ప్రాజెక్టులు ఏవీ లేవు: సీఎం
- పన్నుల పంపిణీలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం
- ఐటీఐఆర్, సెమీకండక్టర్ ప్రాజెక్టుల రద్దుపై విమర్శలు
- మత రాజకీయాలే భాజపా మనుగడకు ఆధారం



2లో

# కరీంనగర్ రాజకీయాల్లో పరస్పర ఒప్పందాలు

- పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు
- బండి సంజయ్ వ్యాఖ్యలకు కౌంటర్
- బీజేపీ–బీఆర్ఎస్ మధ్య అవగాహన ఆరోపణ
- జిల్లా అభివృద్ధిపై కాంగ్రెస్ ఫోకస్



**కరీంనగర్, ఫిబ్రవరి 9 (తెలంగాణ ముచ్చట్లు):**

కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. వీరి రాజకీయ తీరుతోనే కరీంనగర్ జిల్లా అవినీతిమయంగా మారిందని ఆరోపించారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎంఐఎంతో రూ. 100 కోట్ల డీల్ చేసుకుందంటూ

మిగతా 2లో



# మున్సిపల్ ఎన్నికల ఎఫెక్ట్

## విద్యార్థులకు వరుస సెలవుల అవకాశం

- కొన్ని జిల్లాల్లోనే నాలుగు రోజుల హాలీడే ఛాన్స్
- ఈసీ ఆదేశాలతో స్కూళ్లకు సెలవులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇది నిజంగా గుడ్ న్యూస్ అనే చెప్పాలి. ఈ వారంలో వరుసగా నాలుగు రోజుల పాటు స్కూళ్లకు సెలవులు వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ సెలవులు రాష్ట్రవ్యాప్తంగా కాకుండా, మున్సిపల్ ఎన్నికలు జరిగే కొన్ని జిల్లాలు, పట్టణాలకే పరిమితమవుతాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రంలో ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం విద్యాశాఖ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో ఉన్న స్కూళ్లకు ఫిబ్రవరి 11న సెలవులు ప్రకటించాలని సూచించింది. దీనితో ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లకు పోలింగ్ రోజున అధికారికంగా హాలీడే ఇవ్వనున్నారు.

మిగతా 2లో

# కొత్తగూడెం నా సొంతగడ్డ అభివృద్ధి బాధ్యత నాదే

పొంగులేటి శ్రీనివాస రెడ్డి

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్–సీపీఎం అభ్యర్థులకు మద్దతు
- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కార హామీ
- ఇందిరమ్మ ఇండ్లు, పోడు భూముల సమస్యల పరిష్కారం

**భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 9 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):**



భద్రాద్రి కొత్తగూడెం తన సొంతగడ్డ అని, ఈ కార్పొరేషన్‌ను నందనవనంగా తీర్చిదిద్దే పూర్తి బాధ్యత తనదేనని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ, మిత్రపక్షం సీపీఎం అభ్యర్థులకు మద్దతుగా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని త్రీటౌన్ సర్కిల్, రామవరం ప్రాంతాల్లో జరిగిన కార్నర్ మీటింగ్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, స్థానిక నేతలు, అభ్యర్థులు పాల్గొన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్‌ను అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మంత్రి తెలిపారు. ముఖ్యంగా కార్పొరేషన్‌లో తీవ్రంగా ఉన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కిన్నెరసాని నీళ్లను శుద్ధి చేసి, 24 గంటల పాటు సరఫరా చేసే విధంగా త్వరలో ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని స్పష్టం చేశారు. కొత్తగూడెం ప్రజలపై తనకు పూర్తి విశ్వాసం ఉందని పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో 60 డివిజన్లలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

మిగతా 2లో




# హామీల అమలులో కాంగ్రెస్ వైఫల్యం

- కేటీఆర్ తీవ్ర విమర్శలు
- మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ ఫైర్
- కేసీఆర్‌పై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదు

**భూపాలపల్లి, ఫిబ్రవరి 9 (తెలంగాణ ముచ్చట్లు):**

అన్న ఎన్టీఆర్, ఆ తర్వాత చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్‌లను చూశామని, కానీ ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంటి సీఎంను మాత్రం తాము ఎప్పుడూ చూడలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. హామీల గురించి ప్రశ్నిస్తే అభ్యంతరకరమైన, దిగజారిన వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు.

మిగతా 2లో




# తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగింపు

- ఫిబ్రవరి 11న పోలింగ్ – 13న కౌంటింగ్
- వెబ్‌కాస్టింగ్‌తో పటిష్ట నిఘా
- భారీ బందోబస్తు, మద్యం దుకాణాల మూసివేత

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. కొద్దిరోజులుగా గల్లీల్లో వినిపించిన మైకుల హోరు, పార్టీల ప్రచార జోరు పూర్తిగా ఆగిపోయాయి. ఇక పోలింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. ఈ నెల 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరగనుంది. 13న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. మొత్తం 2,996 వార్డుల్లో జరుగుతున్న ఈ ఎన్నికల్లో 12,993 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 52 లక్షల మందిపైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించి అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్నారు.

మిగతా 2లో

# రామాయంపేటలో బీఆర్ఎస్ భారీ రోడ్ షో

- కాంగ్రెస్ పాలనపై హరీష్ రావు తీవ్ర విమర్శలు
- హామీల అమలుపై ప్రశ్నల వర్షం
- కారు గుర్తుకే ఓటేయాలని పిలుపు

**మెదక్ జిల్లా, ఫిబ్రవరి 9 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):**

మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు నిర్వహించిన భారీ రోడ్ షోకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బీఆర్ఎస్ శ్రేణులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీష్‌రావు కాంగ్రెస్ పాలనపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

మిగతా 2లో






# మున్సిపల్ ఎన్నికల వేళ మందు బాబులకు బ్యాడ్ న్యూస్

## ఫిబ్రవరి 11 వరకు మద్యం షాపులు, బార్లు మూసివేత

## ఫలితాల రోజు ఫిబ్రవరి 13న కూడా ఆంక్షలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మద్యం ప్రియులకు బ్యాడ్ న్యూస్ చెప్పాల్సిందే. ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి పోలింగ్ రోజు అయిన ఫిబ్రవరి 11 సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు జరుగుతున్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో ఉన్న వైన్ షాపులు, బార్లు మూసివేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. అలాగే ఎన్నికల ఫలితాల రోజు అయిన ఫిబ్రవరి 13న కూడా మద్యం దుకాణాలు, బార్లు పూర్తిగా మూసివేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రంతో ముగియనుండటంతో,

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మున్సిపల్ ఎన్నికల్లో మోదీ పేరు ఎందుకు?

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):



తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తును ఆలోచించుకొని ఓటు వేయాలని ప్రజలను కోరారు. 12 ఏళ్లుగా కేంద్రంలో ఉన్న భాజపా.. తెలంగాణకు ఏమైనా ప్రాజెక్టులు మంజూరు చేసిందా? అని ప్రశ్నించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

''పాలమూరురంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తామని ప్రధాని మోదీనే స్వయంగా హామీ ఇచ్చారు. వాటి గురించి చెప్పట్లేదు.. కానీ, మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. వరదల్లో నీటమునిగిన వస్తువులన్నీ కేంద్రం నుంచి నిధులు తెచ్చి తిరిగిస్తామని గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బండి సంజయ్ హామీ ఇచ్చారు. ఆ హామీని నమ్మి ఆ పార్టీకి చెందిన 50 మందిని కార్పొరేటర్లుగా గెలిపించారు. ఎన్నికలయ్యాక అడిగితే.. వస్తువులకు బీమా ఉంటుందని బండి సంజయ్ మాటమార్చారు.

దక్షిణాదికి తీవ్ర అన్యాయం

తెలంగాణకు రూ.లక్షల కోట్లు ఇచ్చామని భాజపా నేతలు చెబుతున్నారు. దీనిపై సీఎస్‌ను వివరణ అడిగితే.. మనం రూపాయి చెల్లిస్తే.. కేంద్రం 42 పైసలు ఇస్తోందని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలకు భాజపా తీవ్ర అన్యాయం చేస్తోంది. బిహార్ ఒక్క రూపాయి పన్ను చెల్లిస్తే.. రూ.6.16 కేంద్రం ఇస్తోంది. తెలంగాణకు అన్యాయం జరుగుతున్నప్పుడు ఏ రోజైనా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మాట్లాడారా? మనకు అదనంగా ఇవ్వాల్సిన అవసరం లేదు. మనం చెల్లించిన నిధులు తిరిగిస్తే చాలు. కేంద్రానికి వచ్చే పన్నుల్లో దక్షిణాది రాష్ట్రాలే 40 శాతానికి పైగా చెల్లిస్తున్నాయి. తెలంగాణకు వచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేశారు. హైదరాబాద్‌కు వచ్చిన సెమీకండక్టర్ ప్రాజెక్టును మోదీ ఒత్తిడి చేసి.. ఏపీకి తరలించారు. ఇప్పుడు మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. అసలు మున్సిపల్ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధం? భాజపా నేతలకు దేవుడు అసదుద్దీన్ ఒవైసీ. ఆయన పేరు లేకుండా ఆ నేతల ప్రచారం ఉండదు. మత రాజకీయాల ద్వారా భాజపా రాజకీయ మనుగడ సాగిస్తోంది'' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగింపు

(మొదటి పేజీ తరువాయి)




వీరిలో మహిళా ఓటర్లు 26 లక్షల మంది, పురుష ఓటర్లు 25 లక్షల మంది ఉన్నారు. పోలింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఎన్నికలను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం పటిష్ట చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8,203 పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ సౌకర్యాన్ని కల్పించింది. ఈ ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారానే జరగనున్న నేపథ్యంలో సుమారు 16,301 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసి ఆయా కేంద్రాలకు పంపిణీ చేశారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించి, 24 గంటల కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయనున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు 25,000 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1,900 సమస్యాత్మక, 1,400 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అక్కడ సీసీటీవీ మానిటరింగ్‌తో నిఘా పెంచారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మద్యం దుకాణాలను కూడా మూసివేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిపేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు.

# రామాయంపేటలో బీఆర్ఎస్ భారీ రోడ్ షో

(మొదటి పేజీ తరువాయి)




ప్రసంగంలో హరీష్ రావు మాట్లాడుతూ, ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపించారు. హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్లినా భాషా స్థాయి మారలేదని వ్యాఖ్యానిస్తూ, వ్యక్తిగత వ్యాఖ్యలతో ప్రజలకు మేలు జరగదని అన్నారు. పంద్రాగస్టు నాటికి రుణమాఫీ చేస్తామని చెప్పి మాట తప్పారని, దేవాలయాలు, చర్చిలపై ఒట్టేసి హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. రామాయంపేటకు వచ్చి బహిరంగంగా చర్చకు సిద్ధమా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ప్రశ్నలు లేవనెత్తారు. వృద్ధులకు రూ.4,000 పెన్షన్, మహిళలకు రూ.2,500తో పాటు తులం బంగారం వంటి హామీలు అమలయ్యాయా అని ప్రశ్నించారు. రైతుబంధుకు ఎసరు పెట్టారని, బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా, కేసీఆర్ కిట్ వంటి పథకాలు నిలిచిపోయాయని అన్నారు. కేసీఆర్ హయాంలోనే రామాయంపేటకు డిగ్రీ కాలేజీ, ఆర్డీవో కార్యాలయం వచ్చాయని, రోడ్లు అభివృద్ధి చేసి భూముల విలువ పెరిగిందని గుర్తు చేశారు.

రైతులకు యూరియా సరఫరా, విద్యుత్ సరఫరాపై కూడా విమర్శలు గుప్పించారు. గతంలో 24 గంటల కరెంట్ ఉండేదని, ఇప్పుడు సరైన సరఫరా లేదని అన్నారు. ప్రజలకు సేవ చేసే నాయకులు కావాలా, గుండాగిరి చేసే వారు కావాలా ఆలోచించాలని కోరారు. తమ కార్యకర్తలకు తాను అండగా ఉంటానని స్పష్టం చేస్తూ, జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రామాయంపేట అభివృద్ధి ఆగకూడదంటే కారు గుర్తుపై ఓటేయాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు.

# మున్సిపల్ ఎన్నికల వేళ మందు బాబులకు బ్యాడ్ న్యూస్

(మొదటి పేజీ తరువాయి)




అదే సమయం నుంచి ఈ ఆంక్షలు అమల్లోకి వస్తాయని వెల్లడించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరగాలన్న ఉద్దేశంతో మద్యం నియంత్రణపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయించినా, షాపులు లేదా బార్లు తెరిచి ఉంచినా కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలపై కేసులు నమోదు చేయడంతో పాటు, సంబంధిత లైసెన్సులను కూడా రద్దు చేస్తామని స్పష్టం చేశారు. పోలీస్, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి పర్యవేక్షణ కొనసాగిస్తాయని తెలిపారు. అయితే ఈ మద్యం ఆంక్షలు కేవలం మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో మాత్రమే అమలులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రజలు సహకరించాలని, నిబంధనలు పాటించాలని అధికారులు కోరారు.

# కరీంనగర్ రాజకీయాల్లో పరస్పర ఒప్పందాలు

(మొదటి పేజీ తరువాయి)



బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పరస్పర ఒప్పందానికి వచ్చాయని పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఈ రెండు పార్టీల అవగాహనతోనే అభ్యర్థుల ఎంపిక జరిగిందని పేర్కొన్నారు. బండి సంజయ్, గంగుల కమలాకర్ రాజకీయ చర్యల వల్ల జిల్లా పరిపాలనపై ప్రజల్లో అనుమానాలు పెరిగాయని అన్నారు. గత పదేళ్ల పాలనలో కరీంనగర్ జిల్లా పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని మంత్రి విమర్శించారు. అభివృద్ధి పేరుతో ప్రజలను మభ్యపెట్టారని, వాస్తవంగా జిల్లాకు తగిన న్యాయం జరగలేదని చెప్పారు. అవినీతి, కుమ్మక్కు రాజకీయాలే జిల్లాను వెనక్కి నెట్టాయని ఆరోపించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోందని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. జిల్లా పరిధిలోని కొండగట్టు, వేములవాడ ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, కరీంనగర్‌కు సమగ్ర అభివృద్ధి తీసుకురావడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు.

# మున్సిపల్ ఎన్నికల ఎఫెక్ట్

(మొదటి పేజీ తరువాయి)



ఇదిలా ఉండగా, పోలింగ్ ముగిసిన తర్వాత మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. ఈ కౌంటింగ్ సాధారణంగా పోలింగ్ జరిగిన ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోనే నిర్వహించనున్నారు. అందువల్ల కౌంటింగ్ జరిగే స్కూళ్లకు కూడా ఆ రోజున సెలవులు ప్రకటించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ నిర్ణయం ఆయా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో తీసుకోనున్నారు.

కౌంటింగ్ అనంతరం ఫిబ్రవరి 14న రెండో శనివారం, ఫిబ్రవరి 15న ఆదివారం కావడంతో ఎలాగో స్కూళ్లకు సెలవులు ఉంటాయి. దీంతో ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని విద్యార్థులకు మొత్తం నాలుగు రోజుల పాటు వరుస సెలవులు దొరికే అవకాశముంది. అయితే ఎన్నికలు జరగని ప్రాంతాల్లోని విద్యార్థులకు మాత్రం సాధారణంగా రెండు రోజుల వీకెండ్ సెలవులే వర్తిస్తాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే.. ఈ అదనపు సెలవులు కేవలం మున్సిపల్ ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో మాత్రమే ఉండటంతో పాటు, పూర్తిగా జిల్లా కలెక్టర్ల నిర్ణయంపై ఆధారపడి ఉంటాయి. అందుకే ఆయా జిల్లాల అధికారిక ప్రకటనలను అనుసరించాలని విద్యాశాఖ సూచిస్తోంది.

# కొత్తగూడెం నా సొంతగడ్డ అభివృద్ధి బాధ్యత నాదే

(మొదటి పేజీ తరువాయి)



ఇప్పటికే కొత్తగూడెంలో తొలి విడతగా 3,500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. రాబోయే మూడు విడతల్లో పేదలందరికీ ఇండ్లతో పాటు ఇళ్ల స్థలాలు, కట్టుకున్న ఇళ్లకు పట్టాలు కూడా అందిస్తామని ప్రకటించారు. కొత్తగూడెం సింగరేణి ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న 76 జీవో సమస్యను పరిష్కరించే బాధ్యత తనదేనని మంత్రి స్పష్టం చేశారు. ఈ అంశాన్ని నిన్న జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తావించారని గుర్తుచేశారు. ప్రభుత్వాసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్య సేవలు, చిట్టి రామారావు వంటి ప్రాంతాల్లో పోడు భూముల సమస్యల పరిష్కారం, రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు, విద్యుత్ తీగల తొలగింపు వంటి మౌలిక సదుపాయాలన్నింటినీ ప్రజా ప్రభుత్వం పూర్తిగా పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. కార్పొరేషన్ అభివృద్ధి బాధ్యత తనదేనని, ప్రజల చల్లని దీవెనలతో మూడు రంగుల జెండా కొత్తగూడెంలో ఎగరాలని ఆయన పిలుపునిచ్చారు.

# హామీల అమలులో కాంగ్రెస్ వైఫల్యం

(మొదటి పేజీ తరువాయి)



ఇంతమంది ముఖ్యమంత్రులను ప్రజలు చూశారని, కానీ ఎవ్వరూ ఇలాంటి భాషను ఉపయోగించలేదని అన్నారు. భూపాలపల్లి, పరకాల ప్రాంతాల్లో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచార సభల్లో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాను రద్దు చేయనని ముఖ్యమంత్రి చెబుతున్నారని, అసలు జిల్లాను ఆయన సృష్టించాడా? రద్దు చేయడానికి హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. జిల్లా రద్దు చేస్తే భూపాలపల్లి ప్రజలు ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను తిడితే ఊరుకునేది లేదని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ హెచ్చరించారు. తనను లేదా ఇతర నాయకులను విమర్శిస్తే పరవాలేదని, కానీ కేసీఆర్‌ను, బీఆర్ఎస్ కార్యకర్తలను తిడితే మాత్రం సహించబోమని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి అధికార కాలం రెండేళ్లేనని, ఆ తర్వాత గులాబీ జెండా మళ్లీ ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎంతమంది దేవుళ్లను మొక్కుకున్నా అధికారంలోకి వచ్చాక వదిలిపెట్టేది లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతలు పాలన పక్కనపెట్టి కుంభకోణాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి పనీ చేయలేదని విమర్శించారు.

సింగరేణిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన బావమరిది కలిసి దోచుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే ప్రజలను ఆ పార్టీ నాయకులే ముంచుతారని హెచ్చరించారు. రూ.4 వేల పెన్షన్, తులం బంగారం, రైతుబంధు పెంపు వంటి హామీల్లో ఒక్కటైనా అమలు కాలేదని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడిస్తేనే హామీలు అమలయ్యే పరిస్థితి వస్తుందని ఓటర్లకు పిలుపునిచ్చారు.



# పెద్దమందడి అంగన్వాడీ టీచర్ మృతి

**స్పందించిన ఎమ్మెల్యే మేఘరెడ్డి, సర్పంచ్ గంగ రవి**

**పెద్దమందడి,ఫిబ్రవరి09(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలంలోని అంగన్వాడీ మొదటి సెంటర్‌లో పనిచేస్తున్న టీచర్ చిట్టమ్మ ఆదివారం తెల్లవారుజామున గుండెనొప్పితో మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి విషయం వనపర్తి ఎమ్మెల్యే మేఘరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించారు.అంగన్వాడీ టీచర్లు లేదా హెల్పర్లు మృతి చెందితే తన వంతు ఆర్థిక సహాయం అందిస్తానని మేఘరెడ్డి గతంలో తెలిపారు. గతంలో వెల్టూర్ ప్రాంతంలో అంగన్వాడీ సిబ్బంది మృతి చెందిన సందర్భాల్లో కూడా ఆయన ఆర్థిక సహాయం అందించినట్లు గుర్తు చేశారు.ఈ ఘటనపై పెద్దమందడి మండల సర్పంచ్ గంగ రవి స్పందించి, మృతురాలి కుటుంబానికి రూ.5,000/ రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా పెద్దమందడి మండలం అంగన్వాడీ టీచర్లు మరియు హెల్పర్ల తరపున బి. నారాయణమ్మ, రమాదేవి, రాఘవేంద్రమ్మ, రాణి తమ కృతజ్ఞతలు తెలియజేశారు.







# కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- **భక్తులకు అసౌకర్యం లేకుండా చర్యలు: జిల్లా కలెక్టర్ మను చౌదరి**

**కీసర, ఫిబ్రవరి 09 (తెలంగాణ ముచ్చట్లు):**

మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వీఐపీ దర్శనాల కారణంగా సామాన్య భక్తుల దర్శనానికి ఆటంకం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.సోమవారం కీసరగుట్టకు వచ్చిన కలెక్టర్ ఆలయ పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, మల్కాజ్గిరి డీసీపీ శ్రీధర్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ రెడ్డి ఐపీఎస్, ఆర్డీఓ రాజేష్, ఆలయ కమిటీ చైర్మన్ తటాకం వెంకటేశ్, ఆలయ ఈవో సుధాకర్ రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు పూర్ణకుంభంతో కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు.సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, భక్తుల రద్దీ దృష్ట్యా దర్శన క్యూ లైన్లను విస్తరించాలని, ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచి రద్దీ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని ఆదేశించారు. భక్తుల భద్రతకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. జాతర ప్రాంగణంలో అత్యవసర వైద్య సేవల కోసం వైద్య సిబ్బంది, అంబులెన్సులు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎండ తీవ్రత నేపథ్యంలో క్యూ లైన్లు, దర్శన మార్గాలు, ఆలయ పరిసరాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగ భక్తులకు ప్రత్యేక వాహన సదుపాయం కల్పించి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి శానిటేషన్ పనులు నిరంతరం చేపట్టాలని, చెత్త నిర్వహణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో వ్యాపారులు అధిక ధరలు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని, ధరల వివరాలు స్పష్టంగా ప్రదర్శించేలా చూడాలని సూచించారు.అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలుగా అగ్నిమాపక శాఖ సిబ్బంది, ఫైరింజన్‌ను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. బ్రహ్మోత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# చేర్యాల పట్టణ అభివృద్ధే నా లక్ష్యం

- **ముస్త్యాల అరుణ బాల నర్సయ్య, 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి**

**సిద్దిపేట, ఫిబ్రవరి 09 (తెలంగాణ ముచ్చట్లు):**

చేర్యాల మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో ఉన్న ముస్త్యాల అరుణ బాల నర్సయ్య ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆరో వార్డు పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలను అనురాగపూర్వకంగా కలుసుకుంటూ, ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ప్రజల సమస్యలపై ప్రత్యక్షంగా స్పందిస్తూ, నిస్వార్థ సేవకురాలిగా పని చేస్తానని ఆమె తెలిపారు. ఆరో వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఏ సమస్య ఎదురైనా వారి వద్దకే వెళ్లి పరిష్కారం చూపిస్తానని, చేర్యాల పట్టణాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా నడిపిస్తానని అన్నారు. “మీ ఓటే నా బలం, మీరే నా బలగం” అని పేర్కొన్నారు.ఆరో వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, రేషన్ కార్డుల మంజూరు, పెన్షన్ల మంజూరుపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.





# ఉప్పల్ కురుమ సంఘం అదనపు భవనం నిర్మాణం ప్రారంభం

- **రూ.30 లక్షలతో నిర్మించిన భవనాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్, ఫిబ్రవరి 09 ( తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ డివిజన్ భరత్‌నగర్‌లో కురుమ సంఘానికి సంబంధించిన అదనపు భవనాన్ని కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ భవనం కురుమ సంఘ కార్యకలాపాలకు ఉపయోగపడనుంది. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కురుమలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అలాగే అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కురుమల అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. కురుమ సంఘ అభ్యున్నతికి అవసరమైన ప్రతి సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు పెద్దపీట వేస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో ఉప్పల్ కురుమ సంఘం అధ్యక్షులు చిందం వెంకటేష్ కురుమ, రాష్ట్ర కార్యదర్శి గొరిగే మల్లేష్‌కురుమ, ముఖ్య సలహాదారులు గొరిగే రమేష్‌కురుమ, జన్ని రఘు కురుమ, జోన్ కార్యదర్శి కోండ్ర హనుమంతు కురుమ, జోన్ ఉపాధ్యక్షులు గొరిగే పెద్ద మల్లేష్ కురుమ, ఉప్పల్ కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బర్ల కృష్ణ కురుమ పాల్గొన్నారు.అలాగే సల్లా ప్రభాకర్ రెడ్డి, గొరిగే బాల మహేష్ చంద్ర కురుమ, బట్కిరి బీరప్ప, ఉప్పల్ డివిజన్ అధ్యక్షులు మోటె నరసింహ కురుమ, కొల్లు ఐలయ్య కురుమ, గొరిగే మహేష్ కురుమ, జన్ని వెంకటేష్ కురుమ, కంకల ఎలేందర్ కురుమ, బట్కిరి ధన్ సాగర్ కురుమతో పాటు మహిళా అధ్యక్షురాలు బట్కిరి మంజుల కురుమ, గొరిగే నాగమణి కురుమ, బండారి మంజుల కురుమ, కేమిడి ఇందిర కురుమ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# అశోక్ నాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ విద్యార్థి సేన క్రికెట్ టోర్నమెంట్

**కాకతీయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 09 (తెలంగాణ ముచ్చట్లు):**

కాకతీయ యూనివర్సిటీలో సేవాలాల్ మహారాజ్ 287వ జయంతిని పురస్కరించుకొని సేవాలాల్ విద్యార్థి సేన ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్, అథ్లెటిక్స్ పోటీలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ టోర్నమెంట్ రెండవ రోజు కార్యక్రమాన్ని సేవాలాల్ విద్యార్థి సేన స్టేట్ వైస్ ప్రెసిడెంట్ వంకుడోత్ అశోక్ నాయక్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బంజారా గిరిజన విద్యార్థులు విద్యతో పాటు శారీరక దృఢత్వం, వ్యాయామ విద్య, క్రీడల ద్వారా విజ్ఞానాన్ని, సోదర భావాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. సేవాలాల్ ఆశయాల సాధన కోసం ప్రతి బంజారా విద్యార్థి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలో సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ఈ విధంగా క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమని, బంజారా విద్యార్థుల ఉత్సాహం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

యూనివర్సిటీలోని దాదాపు 32 విభాగాలకు చెందిన విద్యార్థులు, గిరిజన సంఘాల నాయకులు, సేవాలాల్ సేనతో పాటు ఇతర వర్గాల విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం సేవాలాల్ జయంతిని పెద్ద ఎత్తున నిర్వహిస్తూ, క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఐక్యత, సోదర భావం పెంపొందించడంలో కాకతీయ యూనివర్సిటీ బంజారా విద్యార్థులు కీలక పాత్ర పోషిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ రమేష్ నాయక్, లైబ్రరీ ఇంచార్జ్ జవహర్, ప్రొఫెసర్ ఈసం నారాయణ, హన్మకొండ సేవాలాల్ సేన అధ్యక్షుడు మురళి నాయక్, సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్ నాయక్, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు పవన్ నాయక్, శ్రీను, వెంకన్న, సచిన్, శ్రీకాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.





# నాచారం–హెచ్ఎంటి నగర్ అభివృద్ధికి రూ.4.66 కోట్ల పనులకు శంకుస్థాపన

**నాచారం, ఫిబ్రవరి 09 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్‌లో రూ.4 కోట్ల 66 లక్షల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాచారం డివిజన్‌తో పాటు హెచ్ఎంటి నగర్ డివిజన్‌ను కూడా సమానంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా హెచ్ఎంటి నగర్‌లో రూ.70 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.అనంతరం హెచ్ఎంటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా పెద్ద చెరువును రూ.30 కోట్ల రూపాయలతో సుందరీకరించనున్నట్లు ఆయన ప్రకటించారు.పెద్ద చెరువు సుందరీకరణతో నాచారం ప్రాంతంలో దోమల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఈ సూరజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, నాచారం పరిధిలోని వివిధ కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు, బారాస నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఎల్లంపేట్ మున్సిపాలిటీలో ఎంపీ ఈటల రాజేందర్ ఎన్నికల ప్రచారం

- **మున్సిపాలిటీల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం : ఈటల రాజేందర్**

**మేడ్చల్ మల్కాజిగిరి, ఫిబ్రవరి 9 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలో భారతీయ జనతా పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు వార్డుల్లో పర్యటిస్తూ ప్రజలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు.ప్రచారంలో భాగంగా ముదిరాజ్ సంఘం, దళిత సామాజిక వర్గాల ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు మరియు ముఖ్య నాయకులతో ఎంపీ ఈటల రాజేందర్ ఆత్మీయంగా మాట్లాడారు.

ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలపై ఆయన వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం సురక్షితంగా, సుభిక్షంగా అభివృద్ధి దిశగా పయనిస్తోందని అన్నారు. పట్టణాలు, నగరాలు, వార్డుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ, అమృత్ వంటి పథకాల ద్వారా భారీగా నిధులు కేటాయిస్తోందని పేర్కొన్నారు. మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు.రానున్న ఫిబ్రవరి 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులకు కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.

ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## ఎల్కతుర్తి మండలాన్ని కమ్మేసిన దట్టమైన పొగమంచు

**ఎల్కతుర్తి. ఫిబ్రవరి 09( తెలంగాణ ముచ్చట్లు)**

ఎల్కతుర్తి మండలంలో సోమవారం ఉదయం 8 గంటలైనా కూడా దట్టమైన పొగమంచు పూర్తిగా కమ్మేసింది. ఒక్కసారిగా ఏర్పడిన ఈ ఘనమైన పొగమంచు కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
దృశ్యమానం తగ్గిపోవడంతో వాహనదారులు తమ వాహనాల ముందు భాగం లైట్లను ఆన్ చేసుకుని ప్రయాణించాల్సి వచ్చింది. ఉదయం 8 గంటలు దాటినా కూడా పొగమంచు తగ్గకపోవడంతో రహదారులపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. చూడడానికి ఆహ్లాదకరంగా కనిపించినప్పటికీ, దట్టమైన పొగమంచు కారణంగా ప్రజలు, ముఖ్యంగా వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అధికారులు మరియు వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

## నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

**కీసర, (తెలంగాణ ముచ్చట్లు):**

వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా యాదగిరి పల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లలో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో కీసర మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు కీసర విద్యుత్ శాఖ ఏఈ ఎస్. మురళి కృష్ణ తెలిపారు.యాదగిరి పల్లి సబ్‌స్టేషన్ నుండి 11 కేవీ చెర్యాల ఫీడర్ పరిధిలో ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఈ సమయంలో చెర్యాల గ్రామం, టిపిఎస్ పుష్ప నగర్, లాంగ్ సర్వీసెస్, ఎస్ఎల్ఎన్ఎస్ ఎన్‌క్లేవ్, బాలాజీ ఎన్‌క్లేవ్, ఎంఎల్ఆర్ కాలనీ, గణేష్ టౌన్‌షిప్, ఎన్ఎస్ఆర్ బృందావన్, గాంధీ బొమ్మ, రామారావు ఏజీఎల్, సాయి కాలనీ, సాయి నగర్, సుప్రభాత కళాశాల, ఎస్ఎల్ గ్రూప్ చెర్యాల, ఈడెన్ గార్డెన్స్ మరియు కుందన్‌పల్లి చౌరస్తా ప్రాంతాలు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు .అదేవిధంగా యాదగిరి పల్లి సబ్‌స్టేషన్ నుండి 11 కేవీ నర్సంపల్లి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 02:00 గంటల నుండి సాయంత్రం 05:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. ఈ సమయంలో నర్సంపల్లి గ్రామం, డిఆర్‌డిఓ ఎదురుగా, కుండెల్ల ఫారం, పైప్స్ కంపెనీ, ముత్యం గౌడ్ ఫారం, లెదర్ ఫ్యాక్టరీ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.విద్యుత్ వినియోగదారులు ముందస్తుగా అవసరమైన జాగ్రత్తలు తీసుకొని శాఖకు సహకరించాలని కీసర విద్యుత్ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.



## కూతురు పుట్టినరోజున సేవా భావం చాటిన ట్రాఫిక్ కానిస్టేబుల్

- అంబేద్కర్ నగర్ అంగన్వాడికి స్టేషనరీ, 20 కుర్చీల విరాళం

**నాచారం, ఫిబ్రవరి 09 (తెలంగాణ ముచ్చట్లు):**

ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ తన కూతురు అర్నిక టెండూల్ పుట్టినరోజు సందర్భంగా మానవీయతకు నిదర్శనంగా నిలిచారు. ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ అంగన్వాడి కేంద్రంలో చిన్నారులతో కలిసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో చదువుకుంటున్న పిల్లలకు అవసరమైన స్టేషనరీ వస్తువులను పంపిణీ చేయడంతో పాటు అంగన్వాడి అవసరాల కోసం 20 కుర్చీలను కానిస్టేబుల్ దంపతులు అందజేశారు. చిన్నారులతో కలిసి తమ కూతురు పుట్టినరోజును జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని వారు తెలిపారు.సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చే ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాలను చేపట్టాలని కానిస్టేబుల్ దంపతులు పిలుపునిచ్చారు. వారి సేవా భావాన్ని స్థానికులు, అంగన్వాడి సిబ్బంది అభినందించారు.



# విబిజి రామ్‌జీ 2025 చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి

- ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- ప్రజా సంఘాల జేఏసీ కన్వీనర్ మందడి ఇజ్రాయిల్ డిమాండ్

**ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి 9 (తెలంగాణ ముచ్చట్లు)**



వ్యవసాయ కూలీలకు జీవనాధారంగా కాంగ్రెస్ యూపీఏ హయాంలో వామపక్షాల సహకారంతో తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం తెచ్చిన విబిజి రామ్‌జీ 2025 చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని ప్రజా సంఘాల జేఏసీ కన్వీనర్ మందడి ఇజ్రాయిల్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు పేద ప్రజలతో పాటు వ్యవసాయ కూలీల పని భద్రతకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండు దశాబ్దాలుగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా లక్షలాది మంది పేద వ్యవసాయ కార్మికులకు పని కల్పిస్తూ వారి కుటుంబాలకు జీవనాధారంగా నిలిచిందని గుర్తు చేశారు. ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విబిజి రామ్‌జీ 2025 చట్టం అమలుతో వ్యవసాయ కూలీలు తమ జీవనోపాధిని కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. గతంలో ఉపాధి హామీ పథకానికి 90 శాతం నిధులు కేంద్రం, 10 శాతం రాష్ట్రం భరించగా, ఇప్పుడు 60 శాతం కేంద్రం 40 శాతం రాష్ట్రాలు భరించాలనే విధానం ద్వారా ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు.
ఈ బిల్లు ప్రకారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రాంతాల్లో మాత్రమే పనులు కల్పించాల్సి ఉండటం వల్ల, మిగిలిన ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలు పని హక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అలాగే గ్రామపంచాయతీ ప్రణాళికలను బ్లాక్, జిల్లా స్థాయిలోని నేషనల్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్టాక్స్‌లో కలిపి, గ్రామాల అవసరాలను కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యతలకు లోబర్చే ప్రమాదం ఉందని తెలిపారు. ఇలాంటి చర్యల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజల పని హక్కు, కుటుంబ జీవన భద్రత తీవ్రంగా దెబ్బతింటుందని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వ్యవసాయ కూలీలు, రైతులు, పేద ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించి ఉద్యమాలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఇటీవల నిర్వహించిన ఓపెన్ ఫోరంలో అధికారులకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశామని తెలిపారు. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్, పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

**ఫిబ్రవరి 12 సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, లేబర్ హక్కులు, పౌర హక్కులు, ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని మందడి ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యవాదులందరూ ఈ సమ్మెలో పాల్గొని ఉద్యమాన్ని బలోపేతం చేయాలని ఆయన కోరారు.

# ఎన్నికల ప్రచారం ముగిసిన నేపథ్యంలో నిషేధాజ్ఞలు అమలు

**పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 9 (తెలంగాణ ముచ్చట్లు)**



ఖమ్మం జిల్లాలోని మునిసిపాలిటీలకు నిర్వహిస్తున్న ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం సోమవారం సాయంత్రం 5.00 గంటలతో ఎన్నికల ప్రచారం ముగిసిందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు.
ప్రచారం ముగిసిన అనంతరం అమల్లోకి వచ్చే ప్రచార నిషేధ కాలం ( సైలెన్స్ పీరియడ్) సమయంలో ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారం, మైక్‌లు, లౌడ్ స్పీకర్లు, ప్రచార వాహనాలు, పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు లేదా ఇతర ప్రచార కార్యక్రమాలు నిర్వహించడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.
అదేవిదంగా సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కూడా ఎలాంటి ఎన్నికల ప్రచారం, అభ్యర్థులకు అనుకూలంగా లేదా వ్యతిరేకంగా సందేశాలు పంపడం నిషేధమని తెలిపారు. ఈ అంశంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.
పోలింగ్ రోజు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా జరగేలా జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టిందని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించడం జరిగిందని, ఫ్లయింగ్ స్క్వాడ్స్, క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు.
ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమ మద్యం రవాణా, నగదు పంపిణీ, బెదిరింపులు , శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు సూచనలు చేస్తూ, ఎన్నికల నిబంధనలను గౌరవించి, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు సహకరించాలని, ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు అధికారులకు సమాచారం అందించాలని పోలీస్ కమిషనర్ కోరారు.

# క్యాంపస్‌లలో కుల వివక్ష నిర్మూలనకు ఎస్ఎఫ్ఐ భారీ ర్యాలీ

- యూజీసీ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్

**కాప్రా, ఫిబ్రవరి 09 (తెలంగాణ ముచ్చట్లు):**




విశ్వవిద్యాలయాలు, కళాశాల క్యాంపస్‌లలో కుల వివక్షను పూర్తిగా నిర్మూలించాలని, యూజీసీ మార్గదర్శకాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ కాప్రా మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు.క్యాంపస్‌లలో ఏ విద్యార్థి పైనా కులం, మతం, ప్రాంతం, లింగం లేదా ఇతర సామాజిక ఆధారాలపై వివక్ష జరగకూడదని ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అవినాష్, జిల్లా కార్యదర్శి కార్తిక్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. విద్యాసంస్థల్లో సమానత్వం, భద్రత, విద్యార్థుల హక్కుల పరిరక్షణకు యూజీసీ నిబంధనలు కీలకమని వారు తెలిపారు. యూజీసీ మార్గదర్శకాల ప్రకారం కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో యాంటీ-డిస్క్రిమినేషన్ సెల్స్, గ్రీవెన్స్ కమిటీలు, ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.యూజీసీ మార్గదర్శకాల అమలుతో ప్రతి విద్యార్థికి వివక్ష రహిత విద్యా వాతావరణం లభిస్తుందని, కుల వివక్ష, హింస, వేధింపులపై అధికారిక ఫిర్యాదు వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని నాయకులు వివరించారు. అలాగే క్యాంపస్‌లలో మానసిక భద్రత, సామాజిక న్యాయం బలపడుతాయని, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు రక్షణ, సహాయక వ్యవస్థలు అందుతాయని పేర్కొన్నారు. లింగ, మత, ప్రాంతీయ వివక్షలపై కఠిన చర్యలు తీసుకునే విధానాలు అమల్లోకి రావడం వల్ల విద్యార్థుల డ్రాప్‌అవుట్ రేటు తగ్గి సమాన అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అని, భయంలేకుండా, అవమానంలేకుండా అందరికీ విద్య అందాల్సిందేనని ఎస్ఎఫ్ఐ నాయకులు స్పష్టం చేశారు. ఫీజుల భారం, వివక్ష కారణంగా విద్యార్థులు చదువు మానేసే పరిస్థితి రాకూడదని, ప్రతి క్యాంపస్ "సేఫ్ అండ్ ఫ్రీ స్పేస్"గా మారాలని వారు డిమాండ్ చేశారు.ఈ ర్యాలీని కాప్రా మండల కమిటీ అధ్యక్షుడు శ్యామ్ నాయకత్వంలో నిర్వహించగా, కమిటీ సభ్యులు మణీష్, ప్రశాంత్ ముఖ్య పాత్ర పోషించారు.
కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భగత్, జిల్లా కమిటీ సభ్యులు కౌశిక్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.





# గులాబీ జెండా ఎగరడం ఖాయం.!

- సత్తుపల్లి,కల్లూరుల్లో బీఆర్ఎస్ మెజారిటీపై ధీమా.
- కాంగ్రెస్ రెండేళ్ల పాలనపై అసంతృప్తి.
- బీఆర్ఎస్‌కు ప్రజల బలం.
- సండ్ర వెంకట వీరయ్య.

**సత్తుపల్లి, ఫిబ్రవరి 9 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో రాజకీయ వాతావరణం రోజురోజుకు వేడెక్కుతోంది. అన్ని పార్టీలు హోరాహోరీగా ప్రచారం సాగిస్తుండగా, సత్తుపల్లి నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీల్లో ఓటర్ల మూడ్ స్పష్టంగా బయటపడుతోందని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత సండ్ర వెంకట వీరయ్య నాయకత్వంలో పార్టీ ప్రచారం దూకుడుగా కొనసాగుతోంది. ఇంటింటి ప్రచారంలో ప్రజల నుంచి లభిస్తున్న స్పందన తమకు స్పష్టమైన ఆధిక్యాన్ని సూచిస్తోందని ఆయన తెలిపారు. రెండేళ్ల పాలనలో అభివృద్ధి కనిపించలేదు అన్న భావన ప్రజల్లో బలంగా ఉందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో మున్సిపాలిటీ కార్యాలయం, అంబేద్కర్ ఆడిటోరియం, అర్బన్ పార్క్, షాదికాన, 100 పడకల ఆసుపత్రి వంటి కీలక పనులు చేపట్టామని గుర్తు చేశారు. పూర్తైన ఆసుపత్రిని ఇప్పటికీ ప్రారంభించకపోవడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మార్కెట్లు, ఇతర మౌలిక సదుపాయాల పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో పట్టణం అభివృద్ధి వెనుకబడిందని విమర్శించారు. మహిళలకు ఆర్థిక సాయం, పెన్షన్లు, సంక్షేమ హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని ప్రజలు చెబుతున్నారన్నారు. "అధికారం ఉందా లేదా అన్నది కాదు... సేవ చేయాలనే చిత్తశుద్ధి ముఖ్యం" అని సండ్ర వెంకట వీరయ్య స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ అభివృద్ధి చేసి చూపించిన అనుభవం తమకుందని తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేసే అభ్యర్థులనే బీఆర్ఎస్ బరిలో దింపిందన్నారు. సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని, రెండు చోట్లా మెజారిటీ విజయాన్ని బీఆర్ఎస్ నమోదు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.





# మల్కాజ్గిరి డిగ్రీ కళాశాలకు స్పోర్ట్స్ ఐటమ్స్ విరాళం

**వినాయకనగర్, ఫిబ్రవరి 09 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజ్గిరి నియోజకవర్గం వినాయకనగర్ డివిజన్ పరిధిలోని వాజ్పాయి నగర్‌లో ఉన్న మల్కాజ్గిరి డిగ్రీ కళాశాలలో జీహెచ్ఎంసీ (జీఎంసీ) ద్వారా మంజూరైన క్రీడా సామగ్రిని కళాశాలకు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వినాయకనగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, క్రీడలు ఆడటం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉండటంతో పాటు మనస్సు కూడా చురుకుగా ఉంటుందని తెలిపారు. ఆరోగ్యకరమైన శరీరంలోనే ఆరోగ్యకరమైన మనస్సు ఉంటుందని, దాని వల్ల విద్యార్థులు చదువుపై ఏకాగ్రత సాధించి మెరుగైన ఫలితాలు సాధించగలరని అన్నారు.అదేవిధంగా జట్టు క్రీడలు ఆడటం ద్వారా సహకారం, పరస్పర గౌరవం వంటి విలువలు అలవడతాయని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడలకు సమయాన్ని కేటాయించడం ద్వారా సమయ నిర్వహణ, క్రమశిక్షణ వంటి లక్షణాలు విద్యార్థుల్లో పెరుగుతాయని ఆమె తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థుల సర్వాంగీన అభివృద్ధికి క్రీడలు కీలకమని పేర్కొంటూ, స్పోర్ట్స్ ఐటమ్స్ అందజేసిన కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో క్రీడల పట్ల మరింత ఉత్సాహాన్ని పెంచుతుందని ఆయన అన్నారు.

# విద్యార్థుల ఎన్రోల్మెంట్ పెంపుపై మరింత శ్రద్ధ అవసరం

**హన్మకొండ,ఫిబ్రవరి09(తెలంగాణ ముచ్చట్లు):**

జిల్లా పర్యవేక్షణలో భాగంగా సోమవారం పీఎస్ డీఐటీ టీమ్-2 ఐనవోలు మండలం నర్సిములాగూడెం ప్రాథమిక పాఠశాలను సందర్శించింది. ఈ పర్యవేక్షణ బృందంలో నోడల్ ఆఫీసర్ ఎల్. నరేంద్రనాయక్, సభ్యుడు బి. శివప్రసాద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా బృందం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. రవీందర్, ఉపాధ్యాయుడు **వంశీధర్**లతో సమావేశమై పాఠశాలలో కొనసాగుతున్న విద్యా, విద్యేతర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించింది. అడ్మిషన్ రిజిస్టర్‌లో సర్టిఫికెట్ పేజీ ప్రాధాన్యతను వివరించడంతో పాటు వివిధ రకాల రికార్డులను పరిశీలించారు.





తరగతి గది పరిశీలన సందర్భంగా విద్యార్థుల గుణాత్మక ప్రగతికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని బృంద సభ్యులు ప్రశంసించారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు-విద్యార్థుల మధ్య కనిపించిన అనుబంధాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అయితే విద్యార్థుల ఎన్రోల్మెంట్ పెంపుపై మరింత శ్రద్ధ అవసరమని అభిప్రాయపడ్డారు. పాఠశాలలో గ్రంథాలయ గది ఉన్నప్పటికీ అవసరమైన పుస్తకాలు అందుబాటులో లేని అంశాన్ని బృందం గుర్తించింది. టీచర్ హ్యాండ్బుక్, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్‌ల మధ్య సమన్వయం ఉండాల్సిన అవసరాన్ని ఉపాధ్యాయులకు గుర్తుచేశారు. అలాగే పాఠశాల ఆవరణలో విశాలమైన ఆట స్థలం ఉండటం విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొంటూ, దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచనలు చేశారు.

# కాంగ్రెస్ పార్టీతోనే పట్టణాల అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి,ఫిబ్రవరి09(తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతోనే పట్టణాల అభివృద్ధి సాధ్యమవుతుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో చివరి రోజు సందర్భంగా సోమవారం వనపర్తి పట్టణంలోని 10, 11, 28, 29, 30, 31 వార్డుల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా వార్డుల్లోకి ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే మేఘారెడ్డికి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు డప్పు వాయిద్యాలతో, మంగళ హారతులతో, కుంకుమ తిలకం దిద్ది, పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం మూడు సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగుతుందని, రానున్న ఐదు సంవత్సరాలు కలిపి మొత్తం



ఎనిమిది సంవత్సరాల కాలం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండబోతుందని తెలిపారు. అధికార పార్టీకి ఓటేస్తేనే వాడ వాడన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.వనపర్తి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి తానే ఉన్నానని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, ఎంపీగా డాక్టర్ మల్లురవి ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కౌన్సిలర్లుగా కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తేనే పట్టణాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఇతర పార్టీల అభ్యర్థులకు ఓటేసినా ఎలాంటి ప్రయోజనం ఉండదని ప్రజలు గమనించాలని కోరారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని, కేవలం కమిషన్ల కోసం చెరువు కట్టల మరమ్మతుల పేరుతో ప్రజాధనాన్ని దోచుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం రెండు సంవత్సరాల్లోనే అనేక అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు.వనపర్తి పట్టణంలోని 33 వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దాదాపు రూ.100 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల ఏర్పాటు, కాలనీల్లో విద్యుద్దీకరణ, హైమాస్ట్ లైట్ల ఏర్పాటు వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. 33 వార్డుల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులందరూ విజయం సాధించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, పార్టీ పెద్దలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 7, 25 వార్డుల అభివృద్ధికి కదిరే నాగమ్మ రాముల యాదవ్‌ను గెలిపించాలి

జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి,ఫిబ్రవరి09(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి పట్టణంలోని 7, 25 వార్డులు అభివృద్ధి చెందాలంటే మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న కదిరే నాగమ్మ రాముల యాదవ్‌ను కౌన్సిలర్‌గా గెలిపించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి పిలుపునిచ్చారు.ఈ మేరకు వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తకాపు శివసేనారెడ్డి, మున్సిపాలిటీ ఎన్నికల పరిశీలకుడు సంభాని చంద్రశేఖర్‌లతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.గడపగడపకు వెళ్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. ఫుట్ బాల్ గుర్తుకు ఓటు వేసి కదిరే నాగమ్మ రాముల యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.ఈ సందర్భంగా జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ పథకం అమలు



చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చేలా ఇందిరమ్మ ఇండ్లు, ఎస్సీ వర్గీకరణ, రేషన్ కార్డు లేని వారికి కొత్త కార్డులు, రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 6 కిలోల సన్న బియ్యం అందిస్తున్నట్లు చెప్పారు.గత పదేళ్ల కాలంలో వనపర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి నోచుకోలేదని, అవినీతి జరిగిందని విమర్శించారు.మళ్లీ ఆ తప్పు జరగకుండా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, 7, 25 వార్డుల్లో ఫుట్ బాల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

కదిరే రాముల యాదవ్ కరోనా కష్టకాలంలో కూడా ప్రజలకు కూరగాయలు, నిత్యావసర సరుకులు అందిస్తూ ప్రజాసేవ చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో ముందుండి పనిచేసిన వ్యక్తిగా రాముల యాదవ్‌కు మంచి గుర్తింపు ఉందన్నారు. 7వ వార్డులో అనేక సమస్యలు ఉన్నాయని, అవి పరిష్కారం కావాలంటే కదిరే నాగమ్మను గెలిపించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎన్నికైన వెంటనే ముఖ్యమంత్రి సహకారంతో ప్రత్యేక నిధులు తీసుకొచ్చి వార్డును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.7, 25 వార్డుల్లో రాముల యాదవ్ చేసిన సేవలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ బీఫామ్ ఇచ్చినా ఆలస్యం కావడంతో హస్తం గుర్తు రాలేదని, ఫుట్ బాల్ గుర్తు వచ్చిందని తెలిపారు. ఓటర్లు తమ అమూల్యమైన ఓటును ఫుట్ బాల్ గుర్తుకు వేసి కదిరే నాగమ్మ రాముల యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, సీనియర్ నాయకులు పుల్లారెడ్డి, జిల్లా వికలాంగుల సెల్ అధ్యక్షుడు గంజాయి రమేష్, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవన్న యాదవ్, అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం వినోద్, గోపాల్‌పేట్ మండలం జనరల్ సెక్రటరీ జిల్లెల ప్రవీణ్ రెడ్డి, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటన్న యాదవ్, ఎస్టీ సెల్ నాయకుడు దేవిజా నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సహదేవుడు, హరిబాబు రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కొండన్న, బాల్ రాజు, రఘువర్ధన్ రెడ్డి, 7, 25 వార్డుల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రేషన్ దుకాణాల వద్ద పేదల బియ్యం దోపిడి

**తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక కథనానికి స్పందన**

- రేషన్ బియ్యం విక్రయిస్తే కార్డు రద్దు
- పెద్దమందడి తాసిల్దార్ పాండు నాయక్ హెచ్చరిక

**పెద్దమందడి,ఫిబ్రవరి09(తెలంగాణ ముచ్చట్లు):**



"రేషన్ దుకాణాల వద్ద పేదల బియ్యం దోపిడి" అనే శీర్షికతో ఇటీవల తెలంగాణ ముచ్చట్లు దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందనగా పెద్దమందడి మండలంలో తాసిల్దార్ పాండు నాయక్ రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో రేషన్ బియ్యాన్ని బయట విక్రయించినట్లయితే సంబంధిత లబ్ధిదారుల రేషన్ కార్డులను రద్దు చేయడంతో పాటు రేషన్ డీలర్లపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం నిరుపేద కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి రేషన్ కార్డు కలిగిన కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యం సరఫరా చేస్తోందని తాసిల్దార్ తెలిపారు. అయితే కొందరు లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని అక్రమంగా బయట విక్రయిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు.రేషన్ లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.రేషన్ బియ్యం అక్రమంగా విక్రయించినా లేదా కొనుగోలు చేసినా సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.అలాగే రేషన్ డీలర్లు పూర్తిస్థాయిలో బాధ్యతగా వ్యవహరించి, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరైన విధంగా బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.గతంలో రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం సరఫరా జరిగేదని, ప్రస్తుతం ప్రభుత్వం నాణ్యమైన సన్నబియ్యం అందజేస్తోందని గుర్తుచేశారు.ఇలాంటి పరిస్థితుల్లో కూడా బియ్యం అక్రమంగా విక్రయించడం ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని దుర్వినియోగం చేయడమేనని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న పేదల సంక్షేమ పథకాలను లబ్ధిదారులు బాధ్యతగా వినియోగించుకోవాలని తాసిల్దార్ పాండు నాయక్ కోరారు.



# జ్యోతిర్ముడి కార్యక్రమంలో పాల్గొన్న పామిరెడ్డిపల్లి సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం

**పెద్దమందడి, (తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో ఉన్న వైరాగ్యగిరి శివాలయంలో నిర్వహించిన జ్యోతిర్ముడి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరయ్య దాసు హాజరై శివయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పరమశివుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితంలో సుఖశాంతులు వెల్లివిరియాలని కోరుకున్నారు. జ్యోతిర్ముడి కార్యక్రమ సందర్భంగా శివ నామస్మరణతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.అలాగే సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం ఆధ్వర్యంలో జ్యోతిర్ముడి కార్యక్రమం సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు స్వయంగా అన్నదాన వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రాములమ్మ, మాజీ సర్పంచ్ తిక్కన్న, మాజీ ఎంపీటీసీ ఇందిరా లక్ష్మారెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, శివ స్వాములు, గురు స్వాములు, గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# గంగిరెద్దుల కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం

- స్పందించిన మోజర్ల గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్

**పెద్దమందడి,ఫిబ్రవరి09(తెలంగాణ ముచ్చట్లు);**

పెద్దమందడి మండలం మోజర్ల గ్రామ పరిధిలోని బుర్రవాగు సమీపంలో నివసిస్తున్న గంగిరెద్దుల కుటుంబాలు విద్యుత్ కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ దృష్టికి వచ్చింది. ఈ సమస్యపై ఆయన వెంటనే స్పందించారు.సర్పంచ్ చొరవతో విద్యుత్ శాఖ ఏఈతో సంప్రదింపులు జరిపి,అవసరమైన విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేయించారు. దీంతో గంగిరెద్దుల కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వచ్చి వారి దీర్ఘకాల సమస్యకు పరిష్కారం లభించింది.

ఈ సందర్భంగా విద్యుత్ సమస్యను పరిష్కరించిన గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్‌కు గంగిరెద్దుల కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




## టాప్ 10 గ్లోబల్ రెవెన్యూ కంపెనీలు వెల్లడి.. అమెరికా ఆధిపత్యం మరోసారి స్పష్టం!

ప్రపంచ వ్యాపార రంగంలో కంపెనీల శక్తిని కొలిచే ప్రమాణాల్లో లాభాలు, మార్కెట్ క్యాపిటలైజేషన్, ఉద్యోగుల సంఖ్య ఉన్నప్పటికీ, అసలైన బలం ఆదాయమేనని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తాజా గణాంకాల ప్రకారం ప్రపంచంలో అత్యధిక ఆదాయం సంపాదిస్తున్న టాప్ 10 గ్లోబల్ కంపెనీల జాబితా తాజాగా వెలువడింది. ఈ జాబితాలో మరోసారి అమెరికా కంపెనీల ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది. టాప్ 10లో మొత్తం ఏడు అమెరికా సంస్థలు చోటు దక్కించుకోగా, చైనాకు చెందిన రెండు సంస్థలు, సౌదీ అరేబియాకు చెందిన ఒక సంస్థ మాత్రమే స్థానం సంపాదించాయి.

రిటైల్ రంగంలో ప్రపంచ దిగ్గజంగా నిలిచిన అమెరికాకు చెందిన వాల్మార్ట్ సుమారు 703 బిలియన్ డాలర్ల ఆదాయంతో ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఈకామర్స్ రంగంలో దూసుకుపోతున్న అమెజాన్ దాదాపు 691 బిలియన్ డాలర్ల ఆదాయంతో రెండో స్థానంలో నిలిచింది. మూడో స్థానంలో సౌదీ అరేబియాకు చెందిన చమురు దిగ్గజం సౌదీ అరామ్‌కో నిలవగా, నాలుగు నుంచి ఆరు స్థానాల్లో చైనాకు చెందిన సినోపెక్, పెట్రోచైనా, అమెరికాకు చెందిన యునైటెడ్ హెల్త్ సంస్థలు ఉన్నాయి.

ఇక టాప్ 10లో మిగతా స్థానాలను అమెరికాకు చెందిన ఆపిల్, బెర్క్‌షైర్ హాత్వే, CVS హెల్త్, మెక్‌కెసన్ సంస్థలు దక్కించుకున్నాయి. ముఖ్యంగా హెల్త్‌కేర్, టెక్నాలజీ, రిటైల్ రంగాల సంస్థలు ప్రపంచ ఆదాయంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు ఈ జాబితా ద్వారా స్పష్టమవుతోంది.

భారతీయ కంపెనీల విషయానికి వస్తే, ప్రస్తుతం ఆదాయం పరంగా ఏ భారతీయ సంస్థ కూడా టాప్ 10 గ్లోబల్ రెవెన్యూ జాబితాలోకి ప్రవేశించలేకపోయింది. భారతదేశం నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్ సుమారు 114.6 బిలియన్ డాలర్ల ఆదాయంతో ప్రపంచ వ్యాప్తంగా 65వ స్థానంలో నిలిచింది. అలాగే LIC సుమారు 106.16 బిలియన్ డాలర్ల ఆదాయంతో 68వ స్థానంలో ఉంది. ఇండియన్ ఆయిల్ కూడా టాప్ 100 గ్లోబల్ కంపెనీల జాబితాలో స్థానం సంపాదించింది.

2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కంపెనీల పనితీరు ఆధారంగా రూపొందించిన ఈ జాబితా, ప్రపంచ వ్యాపార రంగంలో అమెరికా, చైనా, సౌదీ అరేబియా వంటి దేశాల ఆధిపత్యాన్ని మరోసారి రుజువు చేస్తోంది. భవిష్యత్తులో టెక్నాలజీ, ఎనర్జీ, హెల్త్‌కేర్ రంగాల్లో పోటీ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




## ఒప్పోలో విలీనం కానున్న రియల్‌మీ.. ఉద్యోగాల కోత తప్పదా?

భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో తన పట్టును మరింత పటిష్టం చేసుకునేందుకు ఒప్పో సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. తన సబ్‌బ్రాండ్ అయిన రియల్‌మీ కార్యకలాపాలను ఒప్పోలో విలీనం చేసే ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ఈ ఏకీకరణలో భాగంగా ప్రధానంగా సేల్స్, సర్వీస్, బ్యాక్‌ఎండ్ ఆపరేషన్లలో మార్పులు చేపట్టి, వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడమే లక్ష్యంగా కంపెనీ అడుగులు వేస్తోంది. ఈ విలీనానికి ప్రధాన కారణం ఖర్చుల నియంత్రణే అని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఒప్పో, రియల్‌మీ వేర్వేరుగా నిర్వహిస్తున్న బ్యాక్‌ఎండ్ వ్యవస్థలను ఒకే తాటిపైకి తీసుకురావడం ద్వారా అనవసర వ్యయాలను తగ్గించుకోవాలని యాజమాన్యం భావిస్తోంది. అలాగే ఆపరేషనల్ ఖర్చులను ఆప్టిమైజ్ చేస్తూ పరిశోధన-అభివృద్ధి విభాగం, సరఫరా గొలుసు నిర్వహణను మరింత బలోపేతం చేయాలనే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. చైనాలో ఇప్పటికే అమలులో ఉన్న 'యూనిఫైడ్ మోడల్' భారత్‌లోనూ ప్రవేశపెట్టడం ఇందులో భాగమే.


ఈ పునర్వ్యవస్థీకరణ ప్రభావం ఉద్యోగులపై పడే అవకాశం ఉందన్న వార్తలు కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా రియల్‌మీకి చెందిన సేల్స్, సర్వీస్ విభాగాల్లో కోతలు తప్పవని సమాచారం. ఇప్పటికే కొంతమంది సేల్స్ నెట్‌వర్క్ ఉద్యోగులకు ఏప్రిల్ 30లోగా తమ విధులకు రాజీనామా చేయాలంటూ సూచనలు అందినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. భవిష్యత్తులో ఈ బాధ్యతలను ఒప్పో మార్కెటింగ్, సర్వీస్ నెట్‌వర్క్‌లే పూర్తిగా నిర్వహించే అవకాశముంది.

ఇది కొత్త విషయం కాదు. గతంలో 2021లో వన్‌ప్లస్ విషయంలోనూ ఇదే తరహా విలీన ప్రక్రియ జరిగింది. అప్పట్లో కూడా ఆర్ అండ్ డీ, ఆపరేషన్లను ఒప్పోతో ఏకీకృతం చేశారు. 2018లో ఒప్పో సబ్‌బ్రాండ్‌గా ప్రారంభమైన రియల్‌మీ, ఎనిమిదేళ్ల తర్వాత తిరిగి ఒప్పో గొడుగు కిందకు చేరుతుండటం గమనార్హం.

విలీనానంతరం కూడా బ్రాండ్ గుర్తింపు పరంగా ఒప్పో, రియల్‌మీ వేర్వేరుగా కొనసాగనున్నాయని సమాచారం. అయితే లోపలి కార్యకలాపాలు మాత్రం ఒకే వ్యవస్థలోకి వస్తాయి. దీని వల్ల రాబోయే ఒకటి రెండు సంవత్సరాల్లో రియల్‌మీ తన ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోను మరింత క్రమబద్ధంగా రూపొందించే అవకాశం ఉందని టెక్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఉద్యోగుల భవితవ్యంపై స్పష్టత రావాలంటే కంపెనీ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉందని వారు చెబుతున్నారు.

# సండ్ర అభ్యర్థులను ఓడించాలి

**మాజీ ఎస్సి కార్పొరేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పిడమర్తి రవి**



హైదరాబాద్,ఫిబ్రవరి9(తెలంగాణ ముచ్చట్లు): ఈనెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో సత్తుపల్లి నియోజకవర్గంలోని సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీలలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి ప్రజలను కోరారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పనిచేస్తున్న పార్టీగా కాంగ్రెస్ నిలిచిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజల రోజువారీ జీవనంతో నేరుగా ముడిపడి ఉంటాయని, మున్సిపాలిటీల అభివృద్ధి ప్రజల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల మెరుగుదల కోసం ఈ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

వివిధ పార్టీల మధ్య మారుతూ చివరికి బీఆర్ఎస్‌కు చెందిన సండ్ర వెంకట వీరయ్య తరపున నిలబడిన అభ్యర్థులను ఈ ఎన్నికల్లో ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ మార్పుల రాజకీయాలు ప్రజలకు ఎలాంటి మేలు చేయవని, స్థిరమైన విధానాలు, స్పష్టమైన అభివృద్ధి దృష్టికోణం ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులకే ఓటు వేయాలని కోరారు. మున్సిపల్ స్థాయిలో పారదర్శక పాలనను నెలకొల్పడం, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొక్కల గడ్డ చంద్రశేఖర్ తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

- **ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పరమేశ్వర్ రెడ్డి**
- **ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీని అభినందించిన పరమేశ్వర్ రెడ్డి**

ఉప్పల్,ఫిబ్రవరి09(తెలంగాణ ముచ్చట్లు): ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. సోమవారం ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ప్రతినిధులు పరమేశ్వర్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన వేముల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పారేల్లి సాగర్. ఉపాధ్యక్షులు ఏవి శ్రీధర్ రావు, కూకుట్ల నరోత్తం రెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీ దాస రాజు మరియు సీనియర్ జర్నలిస్టులు దొంతుల వెంకట రామిరెడ్డి, కొలనుపాక చంద్రమౌళి,పల్లా మహేందర్ రెడ్డి, కోడికంటి శ్రీనివాస్, ఎస్. ముత్యంరెడ్డి, ఓ.రమేష్, రాజులను ఆయన అభినందించారు. ఈసందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర ఎనలేనిదని తెలిపారు. పాత్రికేయులకు తాను ఎల్లప్పుడూ చేదోడువాదోడుగా ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు నూతనంగా ఎన్నికైన ఉప్పల్ ప్రెస్ క్లబ్ కమిటీకి తన వంతు సహాయక సహకారాలు ఉంటాయని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.

# వడ్డేపల్లి మున్సిపాలిటీ అభివృద్ధే నా లక్ష్యం

- **5వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి నాయక్ యుగంధర్ రెడ్డి**




వడ్డేపల్లి,ఫిబ్రవరీ09(తెలంగాణ ముచ్చట్లు): వడ్డేపల్లి మున్సిపాలిటీ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని వడ్డేపల్లి 5వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి నాయక్ యుగంధర్ రెడ్డి అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ మద్దతుతో 5వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో ఉన్న యుగంధర్ రెడ్డి, ఎన్నికల ప్రచారంలో భాగంగా ఐదో వార్డు పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలను అనురాగపూర్వకంగా కలుసుకుంటూ, ఎన్నికల్లో సింహం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.

ప్రజల సమస్యలపై ప్రత్యక్షంగా స్పందిస్తూ నిస్వార్థ సేవకుడిగా పనిచేస్తానని ఆయన తెలిపారు. ఐదో వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఏ సమస్య ఎదురైనా వారి వద్దకే వెళ్లి పరిష్కారం చూపిస్తానని, వడ్డేపల్లి మున్సిపాలిటీని సమగ్ర అభివృద్ధి దిశగా నడిపిస్తానని అన్నారు. "మీ ఓటే నా బలం, మీరే నా బలగం" అని పేర్కొన్నారు. ఐదో వార్డులో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, వీధి దీపాల ఏర్పాటు, రేషన్ కార్డుల మంజూరు, పెన్షన్ల మంజూరుపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని యుగంధర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12 సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

- **అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు కనీస వేతనం రూ.26,000 డిమాండ్**



మేడ్చల్–మల్కాజిగిరి, ఫిబ్రవరి 09 (తెలంగాణ ముచ్చట్లు): అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను కార్మికులుగా గుర్తించి ప్రభుత్వ ఉద్యోగ హోదా కల్పించాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలు సునీత, కార్యదర్శి బి. శోభారాణి డిమాండ్ చేశారు.కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్లు, ప్రజావ్యతిరేక ఎన్ఈపీ-2020 చట్టాలను తక్షణమే రద్దు చేయాలని వారు కోరారు. ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.నాలుగు లేబర్ కోడ్ల ద్వారా కార్మికుల సంఘటిత శక్తిని నిర్వీర్యం చేసి యజమాన్యాల దోపిడీకి చట్టబద్ధత కల్పిస్తున్నారని విమర్శించారు. అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను కార్మికులుగా గుర్తించకుండా కనీస భద్రత లేకుండా పనిచేయిస్తున్నారని ఆరోపించారు.50 సంవత్సరాలుగా విజయవంతంగా కొనసాగుతున్న ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటీకరణకు మార్గం వేస్తున్నారని తెలిపారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల పోషణ, విద్య హక్కులపై దాడి చేసే విధానాలను కార్మిక వర్గం అంగీకరించదని స్పష్టం చేశారు.ఐసిడిఎస్‌ను పూర్తిస్థాయిలో బలోపేతం చేసి సరైన భవనాలు, మౌలిక సదుపాయాలు, నాణ్యమైన ఆహారం, సమగ్ర ప్రీ-స్కూల్ విద్య అందించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ టీచర్స్‌ను 3వ తరగతి, హెల్పర్స్‌ను 4వ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని, అంతవరకు నెలకు కనీస వేతనం రూ.26,000, పెన్షన్‌గా రూ.10,000 ఇవ్వాలని కోరారు.స్కీమ్ కార్మికుల కోసం ప్రత్యేక పే కమిషన్ ఏర్పాటు చేయాలని, 45వ, 46వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు గ్రాట్యుటీ చెల్లించాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని కోరారు.ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.



## స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థులకు మద్దతుగా ఇబ్రం శేఖర్ ప్రచారం

స్టేషన్ ఘనపూర్,ఫిబ్రవరి09 (తెలంగాణ ముచ్చట్లు): స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ తరపున 1, 9, 18 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న చింత రాజశేఖర్, ఇందు శ్రావణి, మునిగేల వెంకన్నలకు మద్దతుగా బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రం శేఖర్ చివరి రోజు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూనే రాజకీయ ప్రయోజనాలు పొందుతున్నాయని ఇబ్రం శేఖర్ విమర్శించారు. రాష్ట్రానికి నాయకత్వం వహిస్తున్న వారు పథకాల పేర్లతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను ఎన్నికల సమయంలో కేవలం ఓటర్లుగా మాత్రమే చూస్తున్నారని ఆరోపించారు. సామాజిక వర్గాలను కూలీల మాదిరిగా భావిస్తూ, వారి ఓట్లతోనే రాజకీయాలు సాగిస్తున్నారని అన్నారు. నిజమైన అభివృద్ధి, సామాజిక న్యాయం బహుజన్ సమాజ్ పార్టీ ద్వారానే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్, జిల్లా ఇన్‌చార్జులు జేరిపోతుల మల్లయ్య, పైసా శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు మడిపడిగ చంద్రశేఖర్, నియోజకవర్గ అధ్యక్షుడు జలగం ప్రవీణ్, సీనియర్ నాయకులు గుండె నాగరాజు, బాస్కుల భిక్షపతి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
మంగళవారం- 10 - ఫిబ్రవరి 2026




## బాల నటి నుంచి గ్లామర్ క్వీన్ వరకు..

**చిన్న ఛేంజ్‌తో కుర్రాళ్ల గుండెల్లో గూడు కట్టుకున్న యంగ్ హీరోయిన్**

బాల నటిగా వెండితెరపై అడుగుపెట్టి, తన అమాయకమైన నటనతో ప్రేక్షకుల మనసు గెలుచుకున్న సారా అర్జున్ ఇప్పుడు గ్లామర్ క్వీన్‌గా మారుతూ యంగ్ ఆడియెన్స్‌లో మంచి క్రేజ్ సంపాదిస్తోంది. చిన్నప్పటి నుంచే సినిమాల వాతావరణంలో పెరిగిన ఈ ముద్దుగుమ్మ, వయసు పెరిగేకొద్దీ తన లుక్‌లో చిన్న చిన్న మార్పులు చేసుకుంటూ పూర్తిగా ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యింది. ముఖంలో అమాయకత్వం అలాగే ఉంచుకుంటూనే, కళ్లలో కనిపించే ఆత్మవిశ్వాసంతో ఇప్పుడు యువత మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదిస్తోంది.

కేవలం నటనతోనే కాకుండా, ఫ్యాషన్ మరియు బ్యూటీ స్టైల్‌తో కూడా సారా ప్రత్యేకంగా కనిపిస్తోంది. చాలామంది హీరోయిన్లు కళ్ల అందాన్ని హైలైట్ చేయడానికి నలుపు కాజల్‌ను వాడుతుంటే, సారా మాత్రం బ్రౌన్ కాజల్‌ను తన బ్యూటీ సీక్రెట్‌గా మార్చుకుంది. బ్రౌన్ కాజల్‌తో స్వల్పంగా స్మడ్జ్ చేయడం వల్ల కళ్లకు మృదువైన, సహజమైన లుక్ వస్తుందని ఆమె చెబుతుంది. ఈ చిన్న మార్పే ఆమె లుక్‌కు కొత్త ఆకర్షణను తీసుకొచ్చింది. మేకప్‌లో అతిగా కాకుండా, నేచురల్‌గా కనిపించేలా చూసుకోవడమే తన స్టైల్ అని చెప్పే సారా, చిన్న చిన్న ప్రయోగాలతో తన అందాన్ని మరింత ఆకట్టుకునేలా మార్చుకుంటోంది.

ఫ్యాషన్ విషయంలో కూడా సారా అర్జున్ 'సేఫ్ గేమ్' ఆడకుండా కొత్త ప్రయోగాలకు తెరలేపుతోంది. సంప్రదాయ దుస్తులు అయిన చీరలు, అనార్కలీలకు ఆధునిక టచ్ ఇచ్చి ధరించడం ఆమె ప్రత్యేకతగా మారింది. పాతకాలపు క్లాసిక్ అందాన్ని, నేటి ట్రెండీ స్టైల్‌తో మేళవిస్తూ కనిపించే ఆమె లుక్ యువతను ఆకట్టుకుంటోంది. సంప్రదాయాన్ని గౌరవిస్తూనే, ఫ్యూచరిస్టిక్ డిజైన్స్‌ను అనుసరించడం ఆమె ఫ్యాషన్ సెన్స్‌ను మరింత ప్రత్యేకంగా నిలబెడుతోంది.

చియాన్ విక్రమ్ నటించిన 'నాన్న' సినిమాలో చిన్నారిగా నటించి గుర్తింపు తెచ్చుకున్న సారా, మణిరత్నం తెరకెక్కించిన 'పొన్నియిన్ సెల్వన్' చిత్రంలో చిన్ననాటి నందిని పాత్రతో గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందింది. ప్రస్తుతం 'యుఫోరియా' చిత్రంతో మెయిన్ లీడ్‌గా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. బాలీవుడ్‌లో రణ్‌వీర్ సింగ్‌తో 'ధురంధర్' చిత్రంలో కీలక పాత్రలో కనిపించడంతో, అన్ని భాషల్లోనూ తనకంటూ ప్రత్యేక ఫ్యాన్‌బేస్‌ను సొంతం చేసుకుంటోంది.

ఫ్యాషన్ అంటే కేవలం దుస్తులు మాత్రమే కాదని, వాటిని ధరించే ఆత్మవిశ్వాసమే అసలైన గ్లామర్ అని సారా నమ్ముతుంది. అందుకే ఏ రకమైన ఔట్‌ఫిట్ వేసినా అందులో తనదైన కంఫర్ట్‌ను వెతుక్కుంటుంది. బాలనటి నుంచి గ్లామర్ హీరోయిన్‌గా మారిన ఈ ప్రయాణంలో సారా అర్జున్ చూపిస్తున్న ఆత్మవిశ్వాసం, స్టైల్ నేటి తరం యువతులకు ఒక కొత్త దారిని చూపిస్తోంది

# ధనుష్‌తో ప్రేమాయణం రూమర్ల మధ్య మృణాల్‌పై మరో హీరో పూల వర్షం..




బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ ఇటీవలి కాలంలో డేటింగ్, పెళ్లి రూమర్లతో తరచూ వార్తల్లో నిలుస్తోంది. తమిళ స్టార్ హీరో ధనుష్‌తో ప్రేమాయణం సాగుతోందన్న ప్రచారం ఒకవైపు నడుస్తుండగా.. ఇప్పుడు మరో బాలీవుడ్ యువ హీరో చేసిన పని సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. యంగ్ హీరో సిద్ధాంత్ చతుర్వేది మృణాల్‌పై పూల వర్షం కురిపించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతూ నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

మృణాల్ ఠాకూర్, సిద్ధాంత్ చతుర్వేది కలిసి నటించిన తాజా చిత్రం 'దో దీవానే షెహర్ మే' ప్రమోషన్లలో భాగంగా ఈ ఇద్దరూ ఓ ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవెంట్ వేదిక బయట ఫొటోగ్రాఫర్లతో మాట్లాడుతున్న మృణాల్‌పై సిద్ధాంత్ అకస్మాత్తుగా గొడుగులో తెచ్చిన పూలతో పూల వర్షం కురిపించాడు. దీనికి మృణాల్ ఇచ్చిన స్మైల్ రియాక్షన్ అక్కడున్న వారినే కాదు.. సోషల్ మీడియాలో వీడియో చూసిన నెటిజన్లను కూడా ఆకట్టుకుంది. అక్కడితో ఆగకుండా అదే ప్రమోషనల్ ఈవెంట్ స్టేజ్‌పై కూడా మరోసారి మృణాల్‌పై పూలు చల్లడంతో ఈ ఘటనలు మరింత చర్చకు దారితీశాయి.

ఈ వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో వీరిద్దరి మధ్య ఏదైనా ప్రత్యేక బంధం ఉందా అనే ఊహాగానాలు మొదలయ్యాయి. అభిమానులు తమదైన శైలిలో కామెంట్లు చేస్తూ రూమర్లకు మరింత ఊపునిస్తున్నారు. మరోవైపు మృణాల్ ఠాకూర్ ధనుష్‌తో డేటింగ్‌లో ఉందనే వార్తలు గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి 14న వీరిద్దరి పెళ్లి జరుగుతుందనే రూమర్లు కూడా వచ్చాయి. అయితే ఈ వార్తలను మృణాల్ టీమ్ అధికారికంగా ఖండిస్తూ.. అవి కేవలం పుకార్లేనని స్పష్టం చేసింది. అయినప్పటికీ ఈ రూమర్లు పూర్తిగా చల్లారకపోవడంతో మృణాల్ వ్యక్తిగత జీవితం మరింత ఆసక్తికరంగా మారింది.

సిద్ధాంత్‌తో మృణాల్ తరచూ కలిసి కనిపించడం కూడా కొత్త చర్చలకు కారణమవుతోంది. అయితే వీరిద్దరూ కలిసి సినిమా చేస్తున్న కారణంగానే ప్రమోషన్లలో భాగంగా దగ్గరగా కనిపిస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ హిందీతో పాటు తెలుగులో కూడా వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. 'దో దీవానే షెహర్ మే' చిత్రం ఫిబ్రవరి 20న విడుదలకు సిద్ధమవుతుండగా, అడివి శేష్‌తో కలిసి నటించిన తెలుగు సినిమా 'డెకాయిట్' ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో మృణాల్ కెరీర్‌తో పాటు ఆమె వ్యక్తిగత జీవితం కూడా అభిమానుల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది



## అదిరేటి డ్రెస్‌లో అందాల సెగలు..
## హెబ్బా ఏముందబ్బా!

టాలీవుడ్ బ్యూటీ హెబ్బా పటేల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో బాగా యాక్టివ్‌గా ఉంటూ తన గ్లామర్ ఫొటోలతో కుర్రకారును ఆకట్టుకుంటోంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ స్టైలిష్ డ్రెస్‌లో అదిరిపోయే లుక్‌లో కనిపిస్తూ షేర్ చేసిన ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఆమె అందం, స్టైల్ చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు.

'అలా ఎలా' సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయమైన హెబ్బా పటేల్, తన మొదటి సినిమాతోనే యూత్‌లో విపరీతమైన పాపులారిటీ సంపాదించింది. ఆ చిత్రంలో తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు, మూవీ కూడా పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. ఆ తర్వాత 'కుమారి 21 ఎఫ్' సినిమాలో నటించి, తన గ్లామర్‌తో యూత్ క్రష్‌గా మారిపోయింది. ఈ సినిమా ఆమె కెరీర్‌లో టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది.

తర్వాత 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'నాన్న నేను నా బాయ్‌ఫ్రెండ్స్', 'ఈడోరకం ఆడోరకం', 'ఏంజిల్', '24 కిసెస్', 'మిస్టర్', 'ఓదెల', 'ఓదెల 2' వంటి పలు సినిమాల్లో నటించి మెప్పించింది. గ్లామర్ ఉన్నా కూడా స్టార్ హీరోల సినిమాల్లో పెద్దగా అవకాశాలు దక్కకపోవడంతో ఆశించిన స్థాయిలో కమర్షియల్ సక్సెస్ అందుకోలేకపోయింది. అయినా సరే తనదైన గుర్తింపుతో ఇండస్ట్రీలో నిలబడింది. సినిమాల విషయానికి వస్తే కొంత గ్యాప్ వచ్చినా, సోషల్ మీడియాలో మాత్రం హెబ్బా పటేల్ క్రేజ్ మాత్రం తగ్గడం లేదు. తరచూ స్టైలిష్ డ్రెస్సుల్లో ఫొటోలు షేర్ చేస్తూ ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తోంది. తాజా ఫొటోల్లో ఆమె గ్లామర్, కాన్ఫిడెన్స్ మరింత స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే ఈ ఫొటోలు షేర్ అయిన క్షణాల్లోనే వైరల్‌గా మారాయి. అభిమానులు కామెంట్ల రూపంలో హెబ్బా అందాన్ని తెగ పొగుడుతూ సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు.

# ఇండస్ట్రీనే అల్లాడిస్తున్న బ్యూటీ..

## 19 ఏళ్ల వయసులో తల్లిగా నటించింది..
## 42 ఏళ్ల వయసులో టాప్ హీరోయిన్..




దక్షిణాది చిత్ర పరిశ్రమలో రెండు దశాబ్దాలకు పైగా అగ్రశ్రేణి హీరోయిన్‌గా కొనసాగుతూ, ఇప్పటికీ స్టార్ హీరోల సరసన చేతినిండా సినిమాలతో దూసుకుపోతున్న నటి త్రిష కృష్ణన్. ప్రస్తుతం 42 ఏళ్ల వయసున్నప్పటికీ, ఆమె అందం, గ్లామర్ తగ్గకుండా యువ హీరోయిన్లకు గట్టి పోటీ ఇస్తోంది. చిరంజీవి, ప్రభాస్, ఎన్టీఆర్, విజయ్, అజిత్, సూర్య వంటి స్టార్ హీరోలతో వరుస హిట్ చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. తెలుగులో ప్రభాస్‌తో చేసిన వర్షం సినిమా తర్వాత ఆమె కెరీర్ గ్రాఫ్ ఒక్కసారిగా మారిపోయింది. అయితే చాలా మందికి తెలియని ఆసక్తికర విషయం ఏంటంటే త్రిష సినీ రంగంలోకి పూర్తిగా ఎంట్రీ ఇవ్వకముందే 19 ఏళ్ల వయసులోనే ఒక ప్రకటనలో తల్లి పాత్రలో కనిపించింది. రెండు సంవత్సరాల చిన్నారికి తల్లిగా ఆమె నటించిన ఈ ప్రకటన అప్పట్లో మంచి గుర్తింపు తెచ్చింది. మోడలింగ్ రంగంలో కెరీర్ ప్రారంభించిన త్రిష తొలినాళ్లలో పలు ప్రకటనల్లో నటిస్తూ గుర్తింపు సంపాదించింది.

1999లో వచ్చిన జోడి చిత్రంలో సిమ్రాన్ స్నేహితురాలిగా చిన్న పాత్రతో తెరంగేట్రం చేసిన త్రిష 2002లో మౌనం పెసియాతే సినిమాతో కథానాయికగా మారింది. ఆ తర్వాత వరుసగా తమిళం, తెలుగులో భారీ విజయాలు సాధిస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. తాజాగా తగ్ లైఫ్ చిత్రంలో నటించిన ఆమె ప్రస్తుతం చిరంజీవి సరసన విశ్వంభర సినిమాలో నటిస్తోంది. రెండు దశాబ్దాలుగా ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్‌గా నిలకడగా కొనసాగుతున్న త్రిష ప్రయాణం నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా మారింది

# 'క్రిష్ 4' బడ్జెట్ వివాదం.. డైరెక్టర్‌గా హృతిక్ రోషన్‌కు తొలి పరీక్ష!

బాలీవుడ్‌లో "గ్రీకు వీరుడు"గా పేరుతెచ్చుకున్న హృతిక్ రోషన్‌కు దేశవ్యాప్తంగా భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆయన నటించిన ప్రతి సినిమాకీ ప్రత్యేకమైన క్రేజ్ ఉండగా, ముఖ్యంగా సూపర్ హీరో ఫ్రాంచైజ్ 'క్రిష్' సిరీస్‌కు ఆడియన్స్‌లో ప్రత్యేక డిమాండ్ ఉంది. ఈ సిరీస్‌లో వచ్చిన గత మూడు చిత్రాలు బ్లాక్‌బస్టర్ హిట్స్‌గా నిలవడంతో 'క్రిష్ 4'పై అభిమానుల్లో అంచనాలు అమితంగా పెరిగాయి. ఇప్పటివరకు 'క్రిష్' సిరీస్‌ను హృతిక్ తండ్రి రాకేష్ రోషన్ తెరకెక్కించగా, నాలుగో భాగానికి మాత్రం తొలిసారి స్వయంగా హృతిక్ రోషనే దర్శకత్వ బాధ్యతలు చేపట్టనున్నాడనే వార్తలు బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. హీరోగా మాత్రమే కాకుండా దర్శకుడిగా కూడా తన ప్రతిభను నిరూపించుకోవాలని హృతిక్ భావిస్తున్నట్టు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌కు మరో ఆసక్తికర అంశంగా యష్ రాజ్ ఫిలిమ్స్ ఎంట్రీగా మారింది. భారీ స్థాయి నిర్మాణ విలువలు, టెక్నికల్ స్టాండర్డ్స్‌కు పేరుగాంచిన ఈ



నిర్మాణ సంస్థ 'క్రిష్ 4'ను నిర్మించేందుకు ముందుకు వచ్చిందని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ దశలోనే బడ్జెట్ విషయంలో విభేదాలు తలెత్తినట్టు సమాచారం. హృతిక్ ఈ సినిమాను హాలీవుడ్ స్థాయిలో విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందించాలని భావిస్తూ సుమారు రూ.500 కోట్ల బడ్జెట్ అవసరమని ప్రతిపాదించినట్టు టాక్ వినిపిస్తోంది. అయితే నిర్మాతలు మాత్రం అంత పెద్ద మొత్తానికి సిద్ధంగా లేరని, రూ.350 కోట్లలోనే సినిమా పూర్తి చేయాలని సూచించినట్టు బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. బడ్జెట్ విషయంలో రాజీ కుదరకపోతే ప్రాజెక్ట్ నుంచి తప్పుకునే అవకాశముందన్న మాటలు కూడా వినిపించడంతో ఈ వివాదం మరింత హాట్ టాపిక్‌గా మారింది.

భారీ గ్రాఫిక్స్, ఇంటర్నేషనల్ స్థాయి యాక్షన్ సీక్వెన్సులు, సూపర్ హీరో ఎలిమెంట్స్‌తో 'క్రిష్ 4'ను గ్రాండ్‌గా తెరకెక్కించాలని హృతిక్ ఉత్సాహపడుతున్నాడు. అయితే నిర్మాతల బడ్జెట్ పరిమితులు అతడికి పెద్ద సవాలుగా మారినట్టుగా తెలుస్తోంది. చివరికి హృతిక్ తన విజన్‌కు కొంత రాజీ పడతాడా? లేక తన కాన్సెప్ట్‌కు తగ్గట్లుగా మరో నిర్మాణ సంస్థతో ముందుకు వెళ్తాడా? అనే ప్రశ్న ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. అధికారిక ప్రకటన వచ్చే వరకు 'క్రిష్ 4' భవిష్యత్తుపై ఉత్కంఠ

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## నినాదాల దేశం నిశ్శబ్ద శ్మశానం..

ఈ దేశంలో ఒకరికి కోట్లు వర్షం,
మరొకరికి ఆకలే నిత్య శిక్షం,
అయినా నినాదం ఒకే మాట,
అభివృద్ధి అంటూ మోగే పాట.
బంగారు పళ్ళెంలో భోజన రుచి,
చెత్తబుట్టలో వెతుక్కునే ఆకలి కుచి,
ఈ రెండింటి మధ్యే నడిచే రాజ్యం,
దీనికే పేరు పెట్టారు పురోగతి ధైర్యం.
పుస్తకాలలో మాత్రమే సమానత్వం,
వీధుల్లో మాత్రం అసమానత్వం,
నినాదాల్లోనే ప్రజాస్వామ్యం,
జీవితాల్లో మాత్రం కార్పొరేట్ సామ్రా
జ్యం.
ఒకవైపు భవనాల ఆకాశ ప్రయాణం,
మరోవైపు పేద హృదయాల శ్మశానం,
రోడ్లు వెడల్పయ్యాయి, కలలు ఇరుక
య్యాయి,
మనుషులు సంఖ్యలుగా మారిపో
యాయి.

వోటు వేళ పలకరిస్తారు స్నేహంగా,
ఆకలి అడిగితే పంపిస్తారు మౌనంగా,
ప్రసంగాల్లో వాగ్దానాల వరద
ప్రవాహం,
పేద గుండెల్లో మాత్రం ఎండిన
విశ్వాసం.

మందిరాలు ఎత్తుకు ఎదుగుతాయి,
మనిషి మాత్రం మట్టికి దిగజారుతాడు,
భగవంతుడి పేరు బంగారమవు
తుంది,
భక్తుడి ఆకలి శిల్పమవుతుంది.

ఒకవైపు షేర్ మార్కెట్ సంబరం,
మరోవైపు శ్రమజీవి శోక సమరం,
లాభాల పట్టికలో దేశం సుభిక్షం,
ఆకలి పట్టికలో మనిషి విధ్వంసం.

ఇది అభివృద్ధి కాదు ఓటు వ్యాపారం,
ప్రజల కన్నీళ్లపై నడిచే పాలక
సంస్కారం,
సంపద రాజ్యమై సింహాసనం ఎక్కితే,
మనుషులు సమాధులుగా
లెక్కించబడితే.



- బసడ సంపత్ యాదవ్

## చిన్నారిపై జరిగిన అత్యాచార ఘటనపై స్పందించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



హన్మకొండ,ఫిబ్రవరి09(తెలంగాణ ముచ్చట్లు): రేగొండ మండలం పొనగండ్ల గ్రామంలో 8 ఏళ్ల చిన్నారిపై జరిగిన అత్యాచార ఘటనపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన అత్యంత దారుణమని పేర్కొంటూ, చిన్నారిపై అమానుష నేరానికి పాల్పడిన శ్రీకాంత్, గణేష్‌లపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని పోలీసు అధికారులను కోరారు. ఈ కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించి త్వరితగతిన న్యాయం చేయాలని సూచించారు. బాధిత చిన్నారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని ఫోన్ ద్వారా వైద్యులను అడిగి తెలుసుకున్న ఎంపీ, మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. చిన్నారులపై నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, సమాజంలో భద్రతా వాతావరణం నెలకొల్పాల్సిన అవసరం ఉందని డా. కడియం కావ్య స్పష్టం చేశారు.

## చెన్నై విమానాశ్రయంలో రూ.55.9 లక్షల అక్రమ నగదు పట్టివేత

- పీఈఎస్‌సీ స్క్రీనింగ్‌లో సీఐఎస్ఎఫ్ అప్రమత్తత
- ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పగింత



చెన్నై విమానాశ్రయంలో అప్రమత్తత, వృత్తిపరమైన నిఘా, సమర్థవంతమైన స్క్రీనింగ్ ద్వారా ప్రకటించని భారత కరెన్సీని సీఐఎస్ఎఫ్ సిబ్బంది గుర్తించారు. ఫిబ్రవరి 7న వరణాసికి ప్రయాణించేందుకు సిద్ధమైన ముగ్గురు ప్రయాణికుల హ్యాండ్‌బ్యాగేజీలో రూ.55 లక్షల 90 వేల నగదు బయటపడింది. ఈ విషయాన్ని వెంటనే ఆదాయపన్ను అధికారులకు తెలియజేశారు.
అధికార సంస్థలతో సమన్వయంతో చర్యలు చేపట్టి, పట్టుబడిన నగదితో సహా ప్రయాణికులను తదుపరి విచారణ కోసం ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ అధికారులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది పీఈఎస్‌సీ స్క్రీనింగ్‌లో అప్రమత్తత చూపడం వల్లే అక్రమ నగదు వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. విమానాశ్రయ భద్రత, అక్రమ రవాణా నియంత్రణలో కఠిన చర్యలతో పాటు నిష్కళంకత, వృత్తిపరమైన నిబద్ధతతో విధులు నిర్వర్తించడమే తమ లక్ష్యమని సీఐఎస్ఎఫ్ వెల్లడించింది. దేశ భద్రత, ప్రజాహితాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి చర్యలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

## అత్యాచారం ఎక్కడ జరుగుద్ది?!

సామ్రాజ్యం
సైన్యం
గుర్రాలు, రథాలు,
కత్తులు, తుపాకులు,
ట్యాంకులు, పిస్టళ్లు వున్న చోట్లు.

కోటలు, ద్వారాలు,
మఠాలు, నిర్జన శిథిలాలు,
నల్ల గాజుతో నడిచే బస్సు,
ఖాళీ ఫ్లాట్ లన్నీ కూడా
అత్యాచార గృహాలు.

ఉద్యోగపు ఆశ
సెల్‌ఫోన్
స్నేహమూను.
ఖరీదైన రెస్టారెంట్లు,
మత్తుమాత్రలు...
అడవి
పొలాలు, గోదాములు,
అంతెందుకు
ఆసుపత్రిలోని శస్త్రచికిత్సగది
కూడానూ.

అల్లర్లు
కర్ఫ్యూలు
కరువు
వలసలు
ఎరుపు, పసుపు రంగుల గుర్తులు.
అక్కడ ఇక్కడ అని కాదబ్బా
అసలీ దేశంలో
ప్రతిచోటూ ఓ అత్యాచార కూపమే.



మూలం: 'సమస్తిపూర్ ఔర్ అన్య కవితాయే' పుస్తకం నుండి (పేజీ 182)
రచయిత: అమితాబ్
స్వేచ్ఛానువాదం: దియా విఘ్నేష్

## పరీక్షలకే కాదు.. దేశ భవిష్యత్తుకూ యువత ఆలోచన

- ప్రధాని మోదీ ప్రశంస
- 'వికసిత భారత్'పై విద్యార్థుల దృష్టి
- చిన్న క్రమశిక్షణే పెద్ద మార్పుకు బీజం
- పరీక్షా పే చర్చకు రికార్డు స్పందన



10, 12వ తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే 'వికసిత భారత్' నిర్మాణం గురించి ఆలోచిస్తుండటంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా దేశ భవిష్యత్ లక్ష్యాలపై యువత దృష్టి సారించడం గొప్ప విషయమని అన్నారు. 'పరీక్షా పే చర్చ 2026' రెండో ఎపిసోడ్‌లో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులతో ప్రధాని ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడులోని కోయంబత్తూరుతో పాటు పలు ప్రాంతాల విద్యార్థులతో ప్రధాని సంభాషించారు. 2047 నాటికి దేశాభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలనే విద్యార్థుల ఆలోచనలను ఆయన అభినందించారు. అభివృద్ధి చెందిన దేశాల పౌరుల్లో కనిపించే క్రమశిక్షణను ప్రతి భారతీయుడు అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇంట్లో భోజనం చేసేటప్పుడు ప్లేటులో ఒక్క మెతుకు కూడా వృథా చేయకుండా తినడం లాంటి చిన్న అలవాట్లు దేశానికి ఎంత మేలు చేస్తాయో విద్యార్థులకు వివరించారు. దేశ వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ ఇలాంటి బాధ్యతాయుత ప్రవర్తన పాటిస్తే ఎంత ఆహారం ఆదా అవుతుందో ఊహించాలన్నారు. ఇలాంటి చిన్న పనులే బలమైన, బాధ్యతాయుతమైన భారత్ నిర్మాణానికి పునాదులవుతాయని చెప్పారు.
అలాగే ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రెడ్ లైట్ పడినప్పుడు ఆగడం వంటి సాధారణ చర్యలు కూడా వ్యక్తిగత క్రమశిక్షణకు నిదర్శనమని ప్రధాని పేర్కొన్నారు. స్ఫూర్తి, ప్రేరణలు విజయానికి అదనపు అంశాలే కానీ, నిజమైన పునాది మాత్రం క్రమశిక్షణేనని స్పష్టం చేశారు. తొమ్మిదో విడతగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి 4.5 కోట్లకు పైగా రిజిస్ట్రేషన్లు రావడం విశేషమని తెలిపారు. పరీక్షల ఒత్తిడిని తగ్గించడమే కాకుండా దేశ ప్రగతిలో తమ పాత్ర గురించి విద్యార్థులను ఆలోచింపజేయడమే 'పరీక్షా పే చర్చ' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మోదీ పేర్కొన్నారు.

## రెండు స్థానాల నుంచి బరిలోకి విజయ్



- విరుగంబాక్కం–తిరుచ్చి తూర్పుపై దృష్టి
- చెన్నైకే పరిమితం కాదన్న సంకేతం
- డీఎంకేతో నేరుగా పోటీకి సిద్ధం

నటుడు, తమిళగ వెట్రి కజగం అధ్యక్షుడు విజయ్ తన రాజకీయ అరంగేట్రానికి పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రానున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. చెన్నైలోని విరుగంబాక్కం, మధ్య తమిళనాడులోని తిరుచ్చి తూర్పు స్థానాల నుంచి ఆయన బరిలోకి దిగనున్నారని సమాచారం. పార్టీ విస్తరణతో పాటు వ్యవస్థాపకుడైన విజయ్‌కు బలమైన ఆరంభం కల్పించడమే ఈ వ్యూహం లక్ష్యమని టీవీకే నేతలు చెబుతున్నారు. పట్టణ ఓటర్లు, తొలిసారి ఓటు వేయనున్న యువత ఎక్కువగా ఉన్న విరుగంబాక్కం నియోజకవర్గం విజయ్‌కు అనుకూలంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో తిరుచ్చి తూర్పు నుంచి పోటీ చేయడం ద్వారా పార్టీ చెన్నైకే పరిమితం కాదని, రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలన్న సంకేతాన్ని ఇవ్వాలని భావిస్తున్నారు. వెలచ్చేరి, విక్రవాండి, నాగపట్టణం వంటి నియోజకవర్గాలను కూడా పరిశీలించినప్పటికీ, ఓటర్లతో ఉన్న పరిచయం, క్షేత్రస్థాయిలో పార్టీ సన్నద్ధతను బట్టి చివరకు విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు స్థానాలను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఇది విజయ్ తొలి ఎన్నిక కావడం, అధికార డీఎంకే బలంగా ఉండటంతో గెలుపు అవకాశాలను పెంచుకునేందుకు తీసుకున్న జాగ్రత్త నిర్ణయంగా పార్టీ వర్గాలు వివరిస్తున్నాయి. ప్రస్తుతం విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు నియోజకవర్గాలకు డీఎంకే ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఈ రెండు చోట్లా పోటీ ఆసక్తికరంగా మారనుంది. త్వరలోనే విజయ్ తన ప్రచార వ్యూహాలను అధికారికంగా ప్రకటించి, బహిరంగ సభలు, రాష్ట్రవ్యాప్త పర్యటనలను ముమ్మరం చేసే అవకాశం ఉందని టీవీకే వర్గాలు చెబుతున్నాయి.




## రష్యా చమురుకు భారత్ బ్రేక్?

- రిఫైనరీలు కొత్త ఆర్డర్లకు విరామం
- అమెరికాతో ట్రేడ్‌డీల్ ప్రభావం?

భారత్‌కు చెందిన ప్రధాన రిఫైనరీ సంస్థలు రష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేయడాన్ని దాదాపుగా నిలిపివేసినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన కథనం ఒక ప్రముఖ అంతర్జాతీయ మీడియా ఏజెన్సీలో ప్రచురితమైంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియంతో పాటు దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రిఫైనరీ సంస్థ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా రష్యా ఇంధనాన్ని కొనుగోలు చేసేందుకు తాజాగా ఎలాంటి ఆఫర్లు వెల్లడించలేదని ఆ కథనం పేర్కొంది. మార్చి, ఏప్రిల్ నెలలకు అవసరమైన ఆయిల్ లోడింగ్‌కు సంబంధించి ఇప్పటివరకు కొత్త ఆర్డర్లు రాలేదని సమాచారం. అయితే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, రిలయన్స్ సంస్థలు మాత్రం మార్చి నెలకు సంబంధించిన కొంతమేర ఆర్డర్లను గతంలోనే బుక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇతర భారతీయ రిఫైనరీ కంపెనీలు మాత్రం తమ ఆర్డర్లను పూర్తిగా నిలిపివేసినట్లు కథనంలో వెల్లడైంది. ఇదిలా ఉండగా, ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో భారత్ ట్రేడ్‌డీల్ కుదుర్చుకున్న నేపథ్యంలోనే రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై భారతీయ రిఫైనరీలు వెనకడుగు వేస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాల మధ్య రష్యా నుంచి భారత్‌కు జరిగే ఇంధన దిగుమతులు గత 38 నెలల కనిష్ట స్థాయికి పడిపోయినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.
2025 డిసెంబర్ నెలలో రష్యా నుంచి చమురు దిగుమతుల విలువ 2.7 బిలియన్ డాలర్లుగా నమోదైనట్లు సమాచారం. ఆయిల్ దిగుమతులపై భారత ప్రభుత్వం నుంచి నేరుగా ఎలాంటి ఆదేశాలు జారీ కాలేదని చెబుతున్నప్పటికీ, కంపెనీలు మాత్రం కొత్తగా ఎలాంటి ఆర్డర్లు ఇవ్వడం లేదని తెలుస్తోంది. ఈ పరిణామం భవిష్యత్‌లో భారత్-రష్యా ఇంధన వాణిజ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో అన్న అంశంపై విస్తృత చర్చ జరుగుతోంది.

## నగర ట్రాఫిక్‌కు ఎయిర్ ట్యాక్సీ పరిష్కారం

- రూఫ్‌టాప్‌ల వినియోగంపై సీఐఐ సూచన
- ట్రాఫిక్ రద్దీకి కొత్త మార్గం
- ఏఏఎం సాధ్యాసాధ్యాలపై నివేదిక
- నిబంధనల సవరణ అవసరం




నగరాల్లో రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యకు ఎయిర్ ట్యాక్సీల ద్వారా చెక్ పెట్టాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని భారత పరిశ్రమల సమాఖ్య వెల్లడించింది. చిన్న, తేలికపాటి హెలికాప్టర్లు, ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్ ఆఫ్ అండ్ ల్యాండింగ్ విమానాలను ఎయిర్ ట్యాక్సీలుగా వినియోగించుకునే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. అయితే వీటి టేకాఫ్, ల్యాండింగ్ అంశమే ప్రధాన సవాలుగా మారుతున్న నేపథ్యంలో, నగరాల్లోని భవనాల పైకప్పులను రూఫ్‌టాప్‌లుగా ఉపయోగించవచ్చని సూచించింది. నగర ట్రాఫిక్ రద్దీని తగ్గించి, ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించేందుకు ఎయిర్ ట్యాక్సీలు దోహదపడతాయని సీఐఐ అభిప్రాయపడింది. ఈమేరకు 'నావిగేటింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ ఎయిర్ మొబిలిటీ ఇన్ ఇండియా' పేరుతో ఒక సమగ్ర నివేదికను విడుదల చేసింది. ఢిల్లీ సమీపంలోని గురుగ్రామ్ నుంచి కొత్తగా అభివృద్ధి చెందుతున్న జెవార్ గేట్‌వే వరకు సుమారు 65 నుంచి 75 కిలోమీటర్ల కారిడార్‌ను నమూనాగా తీసుకుని, భారత్‌లో అడ్వాన్స్‌డ్ ఎయిర్ మొబిలిటీ వ్యవస్థ సాధ్యాసాధ్యాలను ఈ నివేదికలో విశ్లేషించింది.
అడ్వాన్స్‌డ్ ఎయిర్ మొబిలిటీ వ్యవస్థలో భాగంగా ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్ ఆఫ్ అండ్ ల్యాండింగ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, ఎయిర్ ట్యాక్సీలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని నివేదిక పేర్కొంది. వీటి టేకాఫ్, ల్యాండింగ్‌లకు నగరాల్లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న భవనాల పైకప్పులను వినియోగించుకుంటే, ప్రత్యేక మౌలిక సదుపాయాల కొరతను చాలా వరకు అధిగమించవచ్చని అభిప్రాయపడింది. ఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో ఎయిర్ ట్యాక్సీల రాకపోకలకు నివాస భవనాలతో పాటు ఆసుపత్రులు, షాపింగ్ కాంప్లెక్సులు, ఐటీ టవర్లను ఉపయోగించుకోవచ్చని సీఐఐ సూచించింది. అయితే ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం రూఫ్‌టాప్‌ల నుంచి సాధారణ వాణిజ్య వర్టికల్ టేక్ ఆఫ్, ల్యాండింగ్‌లకు అనుమతి లేదని గుర్తుచేసింది. ఎయిర్ ట్యాక్సీ వ్యవస్థను విజయవంతంగా అమలు చేయాలంటే ముందుగా ఈ నిబంధనలను సవరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in